teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

## రాష్ట్రంలో మూడు రోజులు భారీ వర్షాలు

### పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

హైదరాబాద్, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలో మరో 3 రోజుల పాటు ఈదుడు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే తెలంగాణలోని పలు జిల్లాలకు

మిగతా 2 లో



ములుగు | సంపుటి : 03 | సంచిక : 160 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | గురువారం | 3 అక్టోబర్ 2024 | పేజీలు : 08 | వెల ‘5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.



## రాష్ట్రంలోని అన్ని పల్లెల్లో సీఎం కప్

### ఈనెల 21నుంచి ప్రతి గ్రామంలో గ్రామస్థాయి సీఎం కప్ పోటీలు


హైదరాబాద్, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలని తెలంగాణ ప్రభుత్వం సిద్ధం అయ్యిందని గ్రామీణ స్థాయి నుంచి సీఎం కప్ ను ఏర్పాటు చేస్తున్నట్లు సాట్ ఛైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. ఎల్బీ స్టేడియంలో నేడు సాయంత్రం 4 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా క్రీడా జ్యోతిని ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలోని పల్లెల్లో

మిగతా 2 లో

## నగర పోలీసులపై తెలంగాణ హైకోర్టు సీరియస్

### యువతి మిస్సింగ్ కేసులో నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం


### కోర్టు ధిక్కారం చేసిన అధికారులకు చురకలు



నగర పోలీసులపై తెలంగాణ హైకోర్టు సీరియస్ అయ్యింది. యువతి మిస్సింగ్ కేసులో నిర్లక్ష్యం వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కారం చేసిన అధికారులకు చురకలు అంటించింది. కేసు విషయంలో సీనియర్ అధికారిని నియమించాలంటూ చెప్పినా సరే నిర్లక్ష్యం వహించడంపై మండిపడింది. కుమార్తె కోసం తండ్రి పడుతున్న ఆవేదన కనిపించడం లేదా అంటూ పోలీసులను ప్రశ్నించింది. వెంటనే కేసు పరిష్కారానికి సీనియర్ అధికారిని నియమించి యువతి ఆచూకీ కుటుంబసభ్యులకు తెలపాలంటూ మరోసారి ఆదేశాలు జారీ చేసింది.

హైదరాబాద్, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ పాతబస్తీ మీర్ చౌక్ ప్రాంతానికి చెందిన దిలీప్ ధారకు దీపికా ధార అనే 19సంవత్సరాల కుమార్తె ఉంది. ఆమె బషీర్‌బాగ్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతోంది. అయితే ఈ ఏడాది ఏప్రిల్ 29న అర్ధరాత్రి నుంచి కుమార్తె దీపికా ధార కనిపించకపోవడంపై అతను మీర్ చౌక్ పోలీసులను ఆశ్రయించాడు. తన కూతురిని నాందెడ్ జిల్లా మహారాష్ట్రకు చెందిన షేక్ రెహానా పాషా అనే వ్యక్తి ఎత్తుకెళ్లాడంటూ ఫిర్యాదు చేశారు. షేక్ పాషా యువతికి మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడంటూ

మిగతా 2 లో








## కబ్జా ఆరోపణలు ఎదుర్కొంటున్న కేయు ఏఆర్ అశోక్ బాబుపై సస్పెన్షన్ వేటు

హన్మకొండ కేయు, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): కబ్జా ఆరోపణలు ఎదుర్కొంటున్న కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పెండ్లి అశోక్ బాబుపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. అశోక్ బాబు వర్సిటీ భూములు అక్రమించుకుని ఇల్లు కట్టుకున్నారనే ఆరోపణలున్నాయి. ఈ ఆరోపణలపై ఫిజికల్ సర్వే నిర్వహించారు విజిలెన్స్, రెవెన్యూ, కేయూ అధికారులు. కుమార్ పల్లి శివారులో కేయూకు చెందిన సర్వే నెంబర్ 229లోనే అశోక్ బాబు ఇల్లు ఉందని నిర్ధారించారు. అయితే తాను యూనివర్సిటీ బయట సర్వే నెంబర్ 235 లో ఇల్లు కట్టుకున్నానంటూ అశోక్ బాబు బుకాయించారు. కానీ

మిగతా 2 లో


OFFICE OF THE REGISTRAR
KAKATIYA UNIVERSITY
WARANGAL – 506009 T.S.

ORDERS

... house which is in the name of his wife Mrs. P. Sunalatha is located in Sy. No. 235 and not in Sy. No. 229. Whereas his house is physically situated in Sy. No. 229, which belongs to Kakatiya University, as per the physical survey of the State Government Departments. Thus, he is deliberately disseminating the false information and creating nuisance by colluding with other encroachers. He is also instigating other fellow encroachers against the University and Government Survey.

Even on 2nd October, 2024, when the Registrar is conducting Gandhi Jayanthi Celebrations as per the instructions of the State Government in the foyer of Administrative Building, and offering tributes to Mahatma Gandhi in a peaceful manner, Mr. P. Ashok Babu came there argued with the Registrar, created nuisance and chaos at the programme, in the presence of University employees and others, which is against the Code of Conduct.

As per Kakatiya University Employees Conduct Rules 1976 (1) every University employee shall at all times maintain absolute integrity and devotion to duty and shall do nothing against the dignity and prestige of the University and as per Rule (15), University employee shall not either in any document published by him or in any communication made



## రాహుల్ గాంధీ గురించి మాట్లాడే అర్హత కేటీఆర్ కు లేదు

### కేటీర్ పై రాష్ట్ర మంత్రి సీతక్క ఫైర్

.. వివరాలు 2లో

## భూగర్భ జలాలు పడిపోకుండా వాటర్‌బోర్డు ముందస్తు చర్యలు

వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు యాక్షన్‌ప్లాన్ అమలు



.. వివరాలు 2లో



## మూసీ నిర్వాసితులకు సర్కార్ తీపి కబురు

### నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు, రూ.25,000 ఆర్థిక సాయం

### ఈ మేరకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ ప్రకటన

హైదరాబాద్, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): మూసీ నిర్వాసితులకు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీపి కబురు అందించింది. నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లతో పాటు రూ.25,000 ఆర్థిక

మిగతా 2 లో



## కేటీఆర్‌పై మంత్రి కొండా ఆరోపణలపై స్పందించిన హరీశ్‌రావు

### మంత్రి కొండా సురేఖ క్షమాపణ చెప్పాలని డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ చేసిన ఆరోపణలపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందించారు. మంత్రి కొండా సురేఖ బేషరతుగా క్షమాపణ చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్

మిగతా 2 లో

## నేటి నుండే హైడ్రా, మూసీ కూల్చివేతలపై బీజేపీ పోరాటం

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంచలన వాఖ్యులు



హైదరాబాద్, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): హైడ్రా, మూసీ కూల్చివేతల విషయంలో బీజేపీ కార్యచరణ గురువారం ప్రకటిస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. మూసీ సుందరీకరణలో భాగంగా నిర్వాసితులయ్యే బాధితులను ఆదుకునేందుకు రేపట్నుంచే తమ పోరాటం ఉంటుందని ఆయన తెలిపారు. మూసీ పరివాహక

మిగతా 2 లో



## ఉరూ.. వాడా.. మొదలైన పూల బతుకమ్మ పండుగ సంబురాలు

### వేడుకలలో పాల్గొన్న మంత్రులు సీతక్క, సురేఖ

తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): పూల జాతర తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక మన బతుకమ్మ పండుగ వచ్చేసింది. రాష్ట్రంలో పూల జాతర షురూవైంది. ఉరూ వాడవాడలా సంబురంగా మొదలైంది. పెత్రామాస నుంచి మొదలు దసరాకు ముందు వరకు పల్లె, పట్నం ఉయ్యాల పాటలతో మారుమోగనున్నాయి. ఆడబిడ్డల ఆటలకు యావత్ తెలంగాణ ఊగిపోనుంది. ఎంగిలిపూల

మిగతా 2 లో



## బీఆర్ఎస్ నేత చల్లా ధర్మారెడ్డిపై ఫోర్జరీ కేసు

### సంతకాన్ని ఫోర్జరీ చేశారని గంటా రాజశేఖర్ ఫిర్యాదు

.. వివరాలు 2లో



## ఎంఎస్ఎంఈలో బీసీలకు అవకాశం కల్పించాలి

### సీఎం రేవంత్ రెడ్డికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి విజ్ఞప్తి

హైదరాబాద్, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఎంఎస్ఎంఈ - 2024 లో ఇతర వర్గాలకు ఇచ్చిన మాదిరిగానే బీసీలకు కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డికి బీసీ సంక్షేమ శాఖ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఎంఎస్ఎంఈ

మిగతా 2 లో

## ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక చర్యలు

### పథకాలు, కార్యక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి

### సీనియర్ ఐఏఎస్ అధికారుల ద్వారా సమన్వయానికి నిర్ణయం

హైదరాబాద్, అక్టోబరు 02 (తీన్మార్ న్యూస్): ప్రజా సంక్షేమం కోసం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పథకాలు, కార్యక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోంది. క్షేత్ర స్థాయిలో పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా గతంలో జిల్లాల్లో పని చేసిన సీనియర్ ఐఏఎస్ అధికారుల

మిగతా 2 లో



## త్వరలో అంగన్ వాడీ పోస్టులను పూర్తి చేస్తాం

### పెండింగ్‌లో అంగన్ వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కారిస్తాం

### రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): త్వరలో ఖాళీగా ఉన్న అంగన్ వాడీ పోస్టులను పూర్తి చేస్తామన్నారు మంత్రి శ్రీధర్ బాబు. పెండింగ్ లో ఉన్న అంగన్ వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కారిస్తామని చెప్పారు. మంథనిలో

మిగతా 2 లో

## కబ్జా ఆరోపణలు ఎదుర్కొంటున్న కేయు ఏఆర్ అశోక్ బాబుపై సస్పెన్షన్ వేటు

మొదటి పేజీ తరువాయి

విజిలెన్స్ సర్వేలో ఆక్రమించుకుని కట్టారని తేలింది. విజిలెన్స్, రెవెన్యూ ఆఫీసర్లు చేసిన సర్వేను తప్పుపడుతూ ఇటీవల సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు అశోక్ బాబు. వర్సిటీ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నాడన్న కారణంతో ఐదు రోజుల కిందట రిజిస్ట్రార్ మెమో జారీ చేశారు. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. అశోక్ బాబు వివరణపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఇన్‌ఛార్జ్ వీసీ వాకాటి కరుణ సస్పెండ్ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. దీంతో అశోక్ బాబును సస్పెండ్ చేస్తూ వర్శిటీ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు.

## భూగర్భ జలాలు పడిపోకుండా వాటర్‌బోర్డు ముందస్తు చర్యలు

హైదరాబాద్, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): గ్రేటర్ సిటీ పరిధిలో భూగర్భ జలాలు పడిపోకుండా వాటర్‌బోర్డు ముందస్తు చర్యలు తీసుకుంటోంది. వచ్చే వేసవిలోనూ నీటి ఎద్దడి రాకుండా ఇప్పటి నుంచే యాక్షన్‌ప్లాన్ అమలు చేస్తోంది. ప్రతి ఇంటిలో తప్పకుండా ఇంకుడు గుంత తవ్వించుకునేలా అవగాహన కార్యక్రమాలు ప్లాన్ చేసింది. ఇందులో భాగంగా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం నుంచి 90 రోజుల పాటు స్పెషల్‌డ్రైవ్ చేపట్టింది. అధికారులు ఇంటింటికీ తిరుగుతూ ఇంకుడు గుంత ఉపయోగాలను వివరించనున్నారు. మరోవైపు ఇంకుడు గుంతలు లేని ఇండ్ల లెక్క తీయనున్నారు. వాటర్‌బోర్డు పరిధిలోని 23 ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌డివిజన్ల పరిధిలో స్పెషల్‌డ్రైవ్ కొనసాగుతుంది. అధికారులు ఇంటింటికి వెళ్లి పాంప్లెట్స్ ఇచ్చి ఇంకుడు గుంతల అవసరాన్ని వివరిస్తారు. 300 గజాల స్థలంలో నిర్మించిన ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత ఉండాలనే నిబంధనను తప్పక అమలు చేస్తామని చెబుతున్నారు. తర్వాత దశల వారీగా 200 గజాల విస్తీర్ణంలోని ఇంటిలోనూ తప్పనిసరిగా ఇంకుడు గుంత నిర్మించుకునేలా ప్లాన్ చేస్తున్నారు. గతేడాది వేసవిలో రోజుకు 12 వేల ట్యాంకర్లను సప్లయ్ చేశారు. ఏయే ప్రాంతాల నుంచి అధిక మొత్తంలో ఆర్డర్లు వచ్చాయన్నది అధికారుల దగ్గర లెక్కలు ఉన్నాయి. ఆయా ప్రాంతాలతోపాటు సిటీ మొత్తం రాబోయే రోజుల్లో వాటర్‌ట్యాంకర్ల డిమాండ్‌తగ్గించేందుకు, భూగర్భ జలాలు పెంచేందుకు స్పెషల్‌డ్రైవ్‌ఉపయోగపడుతుందని వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి తెలిపారు. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత నిర్మించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు.

## రాహుల్ గాంధీ గురించి మాట్లాడే అర్హత కేటీఆర్‌కు లేదు

తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): రాహుల్ గాంధీ గురించి మాట్లాడే అర్హత కేటీఆర్ కు లేదన్నారు మంత్రి సీతక్క. ప్రజల భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారాలుగా మార్చి ప్లాట్లు అమ్ముకున్న చరిత్ర బీఆర్ఎస్ ది అని అన్నారు. రాహుల్ గాంధీ కుటుంబ త్యాగము, కష్టము నిజాయితీ ముందు కేటీఆర్ ఎంత అని ప్రశ్నించారు. చిట్ పేరుతో చాట్ చాట్ గా కాదు డైరెక్ట్ గా మాట్లాడాలని కేటీఆర్ కు హితవు పలికారు సీతక్క. గత మాజీ మహిళా మంత్రుల చరిత్ర ఇప్పటి మహిళా మంత్రుల చరిత్ర ప్రజలకు తెలుసన్నారు. తాము నామినేట్ చేస్తే అప్పనంగా వచ్చినోళ్ళం కాదు.. ప్రజలు ఎన్నుకుంటే వచ్చామన్నారు. పనిగట్టుకుని తాము సినిమా వాళ్లపై మాట్లాడద్లేదన్నారు సీతక్క. ఎవరి వ్యక్తిగత జీవితం వాళ్ళకు ఉంటుందన్నారు. సందర్భాన్ని బట్టి కొంతమంది సినీ ప్రముఖులపై మాత్రమే మాట్లాడారని చెప్పారు. పండగపూట కూడా తమ వెంటపడి అనవసరంగా తప్పుడు కూతలు కూసే కేటీఆర్ మీ కుటుంబం, మీ ఇంట్లో కూడా ఆడవాళ్ళు ఉన్నారని హెచ్చరించారు. తమ బాధ ఆవేదన కేటీఆర్ కుటుంబ సభ్యులకు తప్పకుండా తగులుతుందన్నారు.

## మూసీ నిర్వాసితులకు సర్కార్ తీపి కబురు

మొదటి పేజీ తరువాయి

సాయాన్ని అందించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్రూం ఇళ్లతోపాటు అన్నివిధాలుగా వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. నిర్వాసిత కుటుంబాల్లో విద్యార్థులు విద్యా సంవత్సరం నష్టపోకుండా ఉండేందుకు ప్రత్యేకంగా దృష్టి సారించింది. అంగన్వాడీ నుంచి కాలేజీలకు వెళ్లే విద్యార్థుల వరకు వివరాలు సేకరించింది. నిర్వాసితుల ఇళ్లు సమీపంలో బాధిత పిల్లలు పాఠశాలలు, కాలేజీల్లో ప్రవేశాలు కల్పించేందుకు సన్నాహాలు చేపట్టింది. బాధితులను తరలించే విషయంలో బలవంతంగా కాకుండా బాధితులను ఒప్పించి, మరో ప్రాంతానికి తరలిస్తోంది. ఇందుకోసం ప్రభుత్వం 25 టీములను ఏర్పాటు చేసింది. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టులో నిర్వాసితులయ్యే కుటుంబాల కోసం 16వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. మూసీ నదీ గర్భంలో, బఫర్ జోన్‌లో ఉన్న నిర్మాణాలను కలిగినవారికి పునరావాసం కోసం వీటిని ఉపయోగిస్తారు. మూసీ సుందరీకరణలో భాగంగా మూసీలో ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన దాదాపు 1,600 నిర్మాణాలను సర్వే ద్వారా గుర్తించినట్లు మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ దాన కిషోర్ తెలిపారు. రివర్‌ఫ్రంట్‌లో సుమారు 10,200 మంది నిర్వాసితులు అవుతారని ఇప్పటికే అధికారులు చేపట్టిన సర్వేలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో అంతకు కాస్త ఎక్కువగానే 16వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దానికి అదనంగా కొత్తగా రూ.25వేల ఆర్థిక సాయాన్ని అందించనున్నట్లు ప్రకటించింది.

## బీఆర్ఎస్ నేత చల్లా ధర్మారెడ్డిపై ఫోర్జరీ కేసు

తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ నేత చల్లా ధర్మారెడ్డిపై ఫోర్జరీ కేసు నమోదైంది. ఆయనతో పాటు రియల్టర్ పురుషోత్తమ్ నాయుడుపై మాదాపూర్ పీఎస్‌లో కేసు పెట్టారు. తన సంతకాన్ని ఫోర్జరీ చేశారని విజన్ రిసార్ట్స్ పార్ట్‌నర్ రాజశేఖర్‌రావు ఆ ఫిర్యాదు చేశారు. రాజకీయ నేతలు అధికారంలో ఉంటే ఒకలా లేకుంటే మరోలా ఉంటారని కొందరు సీనియర్ రాజకీయ నేతలు చెబుతారు. ఒక్కోసారి చేసిన పాపాలు సైతం వెంటాడుతాయి. లేటెస్ట్‌గా ఉమ్మడి వరంగల్ జిల్లా పరకాల బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి కష్టాలు రెట్టింపు అయ్యాయి. చల్లా ధర్మారెడ్డితోపాటు రియల్టర్ పురుషోత్తం నాయుడుపై ఫోర్జరీ కేసు నమోదైంది. విజన్ రిసార్ట్స్ పార్ట్నర్ గంటా రాజశేఖర్ రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. తన ఇంట్లోకి చొరబడి సంతకాలు పెట్టమని ధర్మారెడ్డి బెదిరించారన్నది అందులో ముఖ్యమైన పాయింట్. అంతేకాదు తనకు తెలియకుండానే ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి తన సంతకాన్ని ఫోర్జరీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడు బాధితుడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. బాధితుడు తీసుకొచ్చిన పేపర్లను పరిశీలించారు. మరి పోలీసుల దర్యాప్తులో ఇంకెన్ని విషయాలు వెలుగులోకి వస్తాయో చూడాలి.

## ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక చర్యలు

మొదటి పేజీ తరువాయి

ద్వారా పర్యవేక్షణ, సమన్వయాన్ని పెంపొందించాలని నిర్ణయం తీసుకుంది. అందుకే ప్రభుత్వం ఉమ్మడి జిల్లాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించింది. పథకాల అమలుపై వీరు కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందిస్తారు. అటు కలెక్టర్లకు, ఇటు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటారు. ఈ మేరకు 10 ఉమ్మడి జిల్లాలకు 10 మంది సీనియర్ ఐఏఎస్‌లను ప్రత్యేక అధికారులుగా నియమించింది. దీనికి సంబంధించి సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు రవాణా శాఖ కమిషనర్ ఇళంబర్తిబీ కరీంనగర్‌కు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్‌బీ నల్లగొండకు పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్‌బీ నిజామాబాద్‌కు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.శరత్‌బీ రంగారెడ్డికి సెర్ప్ సీఈవో డి.దివ్యబీ మహబూబ్‌నగర్‌కు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి రవిబీ వరంగల్‌కు రోడ్లు-భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన దాసరిబీ ఖమ్మం జిల్లాకు ఖనిజాలు, భూగర్భ గనుల శాఖ కార్యదర్శి కె.సురేంద్ర మోహన్‌బీ హైదరాబాద్‌కు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాటలను నియమించింది. ఈ మేరకు ప్రత్యేక అధికారులు వెంటనే సంబంధిత జిల్లాలను సందర్శించి, కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ముఖ్యంగా ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను పకడ్బందీగా, ప్రభావశీలంగా అమలు చేసేలా చూడాలని తెలిపింది.

# నగర పోలీసులపై తెలంగాణ హైకోర్టు సీరియస్




మొదటి పేజీ తరువాయి

ఆయన ఫిర్యాదులో తెలిపారు. అలాగే తన కుమార్తె అతని ఖాతాకు తన ఫోన్ నుంచి రూ.12వేలు పంపిందని, బీరువాలో దాచిన రూ.25వేలు కూడా తీసుకెళ్లిందని పేర్కొన్నారు. వెళ్లే సమయంలో ఇంటి మెయిన్ డోర్‌కు సైతం తాళం వేసిందని తెలిపారు. ఉదయం లేచి తాము ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదని పోలీసులకు వివరించారు. ఫిర్యాదు స్వీకరించిన మీర్ చౌక్ పోలీసులు దర్యాప్తు చేస్తామని చెప్పి దిలీప్ ధారను ఇంటికి పంపించారు. అయితే బాధితుడు దిలీప్ ధార తన కుమార్తె కోసం రోజుల తరబడి స్టేషన్ చుట్టూ తిరిగాడు. ఎన్ని రోజులైనా వారి నుంచి ఎటువంటి సమాచారం లేదు. పైగా పోలీసుల నుంచి నిర్లక్ష్యపు సమాధానాలు వచ్చాయి. దీంతో విసిగిపోయిన బాధితుడు తన కుమార్తె దీపికా ఆచూకీ తెలిపేలా పోలీసులను ఆదేశించాలంటూ హెబియస్ కార్పస్ రిట్‌తో తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు విచారణ చేపట్టిన ధర్మాసనం కేసు పరిష్కారానికి ఓ ప్రత్యేక సీనియర్ అధికారిని నియమించాలని నగర పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. అయితే హైకోర్టు ఆదేశించినప్పటికీ పోలీసులు అధికారిని నియమించలేదు. దీనిపై బాధితుడు మళ్లీ పోలీసుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇదే విషయాన్ని తెలుపుతూ దిలీప్ మళ్లీ హైకోర్టు మెట్లు ఎక్కారు. దీనిపై విచారణ చేసిన ధర్మాసనం పోలీస్ ఉన్నతాధికారులపై సీరియస్ అయ్యింది. కోర్టు చెప్పినా వినరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి నిర్లక్ష్య ధోరణి సరికాదంటూ హెచ్చరించింది. వెంటనే సీనియర్ అధికారిని నియమించి యువతి ఆచూకీ కుటుంబసభ్యులకు తెలపాలని ఆదేశించింది.

## రాష్ట్రంలోని అన్ని పల్లెల్లో సీఎం కప్

మొదటి పేజీ తరువాయి

ఈ సీఎం కప్ ఉండబోతుంది. ఈనెల 21నుంచి ప్రతి గ్రామంలో గ్రామస్థాయి సీఎం కప్ పోటీలు ప్రారంభమవుతాయి. 6 అథ్లెటిక్స్, కోకో, వాలీబాల్, ఏర్పాటు చేశాం. 21 నుంచి 24 వరకు గ్రామీణ స్థాయి పోటీలు నిర్వహిస్తాం. 24 నుంచి 30 వరకు మండల స్థాయి పోటీలు ఉంటాయి. నవంబర్ 8 నుంచి 13 వరకు జిల్లా స్థాయి పోటీలు ఉంటాయి. 28నవంబర్ డిసెంబర్ 5వరకు రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తాం. గతంలో ఎన్నడూ లేని విధంగా క్రీడాపోటీలు ఏర్పాటు చేస్తున్నాం. రాజకీయాలకు తావులేకుండా క్రీడాపోటీలు జరుపుతాం. సీఎం రేవంత్ రెడ్డి సూచనలతో ముందుకెళ్తున్నాం. అని సాట్ ఛైర్మన్ తెలిపారు. పల్లెల్లో యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని సాట్ ఛైర్మన్ శివసేనారెడ్డి సూచించారు. గ్రామీణ క్రీడాకారుల కోసం యజ్ఞం లాగా సీఎం కప్ ఉండనుంది. రెండు నెలల్లో ఆటల పండుగ సంబరం 21నుంచి ప్రతి గ్రామంలో ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు ప్రారంభిస్తారు. జిల్లా లెవెల్ లో కలెక్టర్ అధ్యక్షతన ప్రారంభిస్తారు. 10ఏండ్లు క్రీడాకారులు నిరుత్సాహంతో ఉన్నారు. ఇప్పుడు ప్రోత్సహిస్తున్నాం. ప్రభుత్వం వచ్చి 8నెలలు అవుతుంది. క్రీడాస్ఫూర్తితో ముందుకెళ్తున్నాం. రూ.361కోట్లు స్పోర్ట్స్ అథారిటీ కి నిధులు కేటాయించారు. గ్రామీణ స్థాయి యువత చెడు అలవాట్లకు లోనవుతున్నారు. యువత భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకొని క్రీడలు ఆడేలా చేస్తున్నాం. క్రీడా ప్రాంగణాలు కబ్జాలకు గురవుతున్నాయి. గ్రామీణ స్థాయిలో గ్రౌండ్స్ ఉండేలా చేస్తాం. గ్రామీణ యువత క్రీడలపై దృష్టి పెట్టాలి. రాజకీయాలకు తావు లేకుండా క్రీడాలను సాట్ పల్లెల్లో యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని సాట్ ఛైర్మన్ శివసేనారెడ్డి సూచించారు. గ్రామీణ క్రీడాకారుల కోసం యజ్ఞం లాగా సీఎం కప్ ఉండనుంది. రెండు నెలల్లో ఆటల పండుగ సంబరం 21నుంచి ప్రతి గ్రామంలో ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు ప్రారంభిస్తారు. జిల్లా లెవెల్ లో కలెక్టర్ అధ్యక్షతన ప్రారంభిస్తారు. 10ఏండ్లు క్రీడాకారులు నిరుత్సాహంతో ఉన్నారు. ఇప్పుడు ప్రోత్సహిస్తున్నాం. ప్రభుత్వం వచ్చి 8నెలలు అవుతుంది. క్రీడాస్ఫూర్తితో ముందుకెళ్తున్నాం. రూ.361కోట్లు స్పోర్ట్స్ అథారిటీ కి నిధులు కేటాయించారు. గ్రామీణ స్థాయి యువత చెడు అలవాట్లకు లోనవుతున్నారు. యువత భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకొని క్రీడలు ఆడేలా చేస్తున్నాం.. క్రీడా ప్రాంగణాలు కబ్జాలకు గురవుతున్నాయి. గ్రామీణ స్థాయిలో గ్రౌండ్స్ ఉండేలా చేస్తాం.. గ్రామీణ యువత క్రీడలపై దృష్టి పెట్టాలి. రాజకీయాలకు తావు లేకుండా క్రీడాలను సాట్ ప్రోత్సహిస్తుంది. అని తెలిపారు.ప్రోత్సహిస్తుంది. అని తెలిపారు.

## ఉరూ.. వాడా.. మొదలైన పూల బతుకమ్మ పండుగ సంబురాలు

మొదటి పేజీ తరువాయి

బతుకమ్మతో రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది రోజుల పూల సంబురం కలర్ ఫుల్ గా జరగనుంది. స్కూళ్లు, కాలేజీలకు కూడా సెలవులు ప్రకటించడంతో అంతటా పండుగ వాతావరణం నెలకొంది. ఇవాళ ఎంగిలిపూల బతుకమ్మతో మొదలైన జాతర సద్దుల బతుకమ్మతో ముగియనుంది. హైదరాబాద్ తో పాటు రాష్ట్రమంతటా బతుకమ్మసంబురాలు వైభవంగా మొదలయ్యాయి. గల్లీలన్ని ఆడబిడ్డల ఆట పాటలతో నేలంతా మురిసిపోతుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హైదరాబాద్ లోని నక్లెస్ రోడ్ లో బతుకమ్మ సంబురాలు నిర్వహించింది. ఈ వేడుకలకు మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ఆడబిడ్డలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు సీతక్క. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సాంప్రదాయ దుస్తుల్లో మహిళలు బతుకమ్మ ఆడుతూ కనువిందు చేశారు. మహిళలతో కలిసి మంత్రి సీతక్క పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. బతుకమ్మ సందర్భంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వరంగల్ లోని తోట మైదానంలో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు మంత్రి కొండా సురేఖ, కలెక్టర్ సత్యశారద దేవి. తొమ్మిది రోజుల పాటు ఒక్కో రోజు ఒక్కో విధంగా ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపింది రాష్ట్ర సర్కార్.

## ఎంఎస్ఎంఈలో బీసీలకు అవకాశం కల్పించాలి



మొదటి పేజీ తరువాయి

విధానంలో మార్పులు తీసుకొచ్చి బీసీల అంశాలను చేర్చేందుకు సానుకూలంగా స్పందించారు. దీంతో మంగళవారం హైదరాబాద్లోని సచివాలయంలో ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావుతో కలిసి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మేధావులు, రిటైర్డ్ ఐఎఎస్లు, బీసీ ఎమ్మెల్యేలు, కార్పోరేషన్ చైర్మెన్లు, పారిశ్రామిక వేత్తలతో సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఎస్ఎంఈ జాతీయ రిటైర్డు డైరెక్టర్ ఆఫ్ జనరల్ చుక్కా కొండయ్యతో పాటు రిటైర్డు ఐఏఎస్ లు , మేధావులు ,పారిశ్రామికవేత్తలతో కలిపి కమిటీ వేయాలని నిర్ణయించారు. ఎంఎస్ఎంఈలో బీసీలకు సంబంధించిన అంశాలను చేర్చేందుకు వారి సలహాలు సూచనలు తీసుకొని అందులో చేర్చాల్సిన అంశాలపై కమిటీ నిర్ణయం తీసుకోనుంది. ప్రభుత్వం తీసుకొచ్చిన ఎంఎస్ఎంఈ పాలసీ దేశంలోనే బెస్ట్ విధానంగా అభివర్ణించారు. ఇందులో ఇతర వర్గాలకు ఇచ్చిన మాదిరి బీసీలకు కల్పిస్తే వారిలో పారిశ్రామిక అభివృద్ధి సాధించవచ్చని తెలిపారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ ఎంఎస్ఎంఈలో బీసీలకు సంబంధించిన ఎలాంటి అంశాలు చేర్చలేదని సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమలు బీసీ కులాలకు సంబంధించిన కుల వృత్తులే అధికంగా ఉంటాయనీ,ఈ విధానంలో బీసీలకు సబ్సిడీలు ఇతర అంశాలు చేరిస్తే లక్షలాది కుటుంబాలు ఈ పాలసీ ద్వారా ఉపాధి అవకాశాలు దొరకటంతో పాటు స్వతహాగా కుల వృత్తులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆర్థిక వృద్ధి సాధించటానికి ఉపయోగపడుతుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి బీసీ కుటుంబం ఒక సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమ అని బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం తెలిపారు. గోల్డ్ స్మిత్ ,రజక ,నాయి బ్రాహ్మణ ,తదితర చేతి వృత్తుల వారికి బీసీల అంశాలు చేరిస్తే ఎంఎస్ఎంఈ లో ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. జాతీయ ఎంఎస్ఎంఈలో ఎస్సీ, ఎస్టీలకు ఇస్తున్న సబ్సిడీల్లో బీసీ ,మైనారిటీ డిజేబుల్ వాళ్ళకి కూడా ఇవ్వాలని రిటైర్డు ఐఎఎస్ చిరంజీవులు సూచించారు. ఎంఎస్ఎంఈ లో బీసీలకు ప్రత్యేక విధానం ఉండాలనీ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు రాష్ట్రంలో బీసీలకు అందించవచ్చని సూచించారు. సమావేశంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్, వీర్లపల్లి శంకర్ బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## త్వరలో అంగన్ వాడీ పోస్టులను పూర్తి చేస్తాం

మొదటి పేజీ తరువాయి

ICDS ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషన్ మహా - 2024 ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు శ్రీధర్ బాబు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. త్వరలో జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో మహిళలకూ సేవలందిస్తున్న అంగన్ వాడీ టీచర్లకు అభినందనలు తెలిపారు మంత్రి శ్రీధర్ బాబు. రాబోయే కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పక్కా భవనాలు నిర్మాణం కావాలని అడుగుతున్నారని అంగన్ వాడీ టీచర్లు, హెల్పర్లు సమాచారం తీసుకుని వారికి కావాల్సిన సదుపాయాలు కల్పిస్తామన్నారు. పౌష్టిక ఆహారంలో నాణ్యత తగ్గకుండా ఇబ్బంది పెట్టకుండా అందరితో కలసి సమన్వయంతో ముందుకెళ్లాలని అధికారులకు సూచించారు శ్రీధర్ బాబు. రోజూ వారీగా అవగాహన




చైతన్య సదస్సులు నిర్వహిస్తామన్నారు. ప్రోటీన్స్, మినరల్స్ అధికంగా ఉన్న బాలామృతం పౌష్టిక ఆహారం ఇస్తామని చెప్పారు శ్రీధర్ బాబు.

## నేటి నుండే హైడ్రా, మూసీ కూల్చివేతలపై బీజేపీ పోరాటం

మొదటి పేజీ తరువాయి

ప్రాంతాల్లో ఇవాళ(బుధవారం) కిషన్ రెడ్డి పర్యటించారు. అంబర్‌పేట్, అసెంబ్లీ, ముసారాంబాగ్, అంబేద్కర్ నగర్, తులసి నగర్ మీదుగా కృష్ణానగర్ వరకూ బస్తీలను సందర్శించారు. కేంద్రమంత్రి స్వయంగా వెళ్లి నిర్వాసిత కుటుంబాల బాధలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మూసీ నిర్వాసితులు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఇళ్లు కోల్పోతే రోడ్డున పడే పరిస్థితి వస్తుందంటూ కిషన్ రెడ్డి ఎదుట కన్నీటి పర్యంతం అయ్యారు. సారూ.. మీరే దిక్కంటూ బోరున విలపించారు. ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నామని, తమను ఇక్కడ్నుంచి పంపించవద్దంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో డబ్బులు ఖర్చు చేసి ఇళ్లు కట్టుకున్నామని చెప్పారు. ఇలాంటి పరిస్థితి వస్తుందని కలలో కూడా ఊహించలేదని అన్నారు. తమను ఆదుకునేందుకు ముందుకు రావాలని కోరారు. అయితే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బాధితులను ఓదార్చారు. ఇళ్లు కూల్చే పరిస్థితి వస్తే తానే అడ్డుగా నిలబడి కాపాడతానని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఎవరూ అధైర్య పడొద్దని, మీ అందరికీ బీజేపీ తోడుగా ఉంటుందని భరోసా కల్పించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ పేదలకు అండగా ఉండటం కోసమే మేము చేపట్టేబోయే భవిష్యత్తు ప్రణాళిక ఉంటుంది. ఈసారి మేము ఏదీ చెప్పి చేయం. హైడ్రా కూల్చివేతలపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఏం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియదు. ఇళ్ల కూల్చివేతలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారు. ఇళ్ల కూల్చడంతో కేంద్రానికి ఏం సంబంధమో ఆయనే చెప్పాలి. ఇది రాజకీయాలు మాట్లాడే సమయం కాదు. పరస్పర రాజకీయ విమర్శలు తర్వాత చేసుకోవచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం వల్ల వేలాది మంది పేదలు రోడ్డున పడే ప్రమాదం ఏర్పడింది. పేదలకు అండగా ఉండటం కోసం జైలుకు వెళ్లేందుకైనా సిద్ధం. మూసీ బాధితులకు బీజేపీ అండగా ఉంటుంది. ఎవరూ భయపడాల్సిన పనిలేదు. మీ కోసం మేము నిలబడతాం. రేపట్నుంచే కొత్త కార్యచరణ అమలు చేయబోతున్నాం. కాంగ్రెస్ బుల్డోజర్లకు అడ్డుగా నిలబడతాం. మీ ఆస్తులకు నష్టం జరగనివ్వం అని హామీ ఇచ్చారు.

## కేటీఆర్‌పై మంత్రి కొండా ఆరోపణలపై స్పందించిన హరీశ్‌రావు

మొదటి పేజీ తరువాయి

చేశారు. కొండా సురేఖ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. రాజకీయ వాదనల్లో పసలేకే వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారన్న మార్గరెట్ థాచర్ కోట్‌ను ఈ ట్వీట్‌కు జతపరిచారు హరీశ్‌రావు. హీరో నాగచైతన్య విడాకులకు కేటీఆరే కారణమని మంత్రి కొండా సురేఖ ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. హీరోయిన్లకు డ్రగ్స్ అలవాటు చేసిందే కేటీఆర్ అని ఆమె ఆరోపించారు. నాగచైతన్య, సమంత జంట విడిపోవడానికి కేటీఆర్ కారణమంటూ మంత్రి సురేఖ చేసిన వ్యాఖ్యలపై నటుడు ప్రకాశ్ రాజ్ కూడా సోషల్ మీడియా వేదికగా మండిపడ్డారు. 'ఏంటీ సిగ్గులేని రాజకీయాలు.. సినిమాల్లో నటించే ఆడవాళ్లంటే చిన్నచూపా..? అంటూ ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కొండా సురేఖ వ్యాఖ్యలను హీరో నాగార్జున కూడా ఖండించారు. రాజకీయాలకు దూరంగా ఉండే సినీ ప్రముఖుల జీవితాలని, మీ ప్రత్యర్థులని విమర్శించేందుకు వాడుకోకండి అని కొండా సురేఖకు నాగార్జున హితవు పలికారు. దయచేసి సాటి మనుషుల వ్యక్తిగత విషయాలని గౌరవించండని సూచించారు. బాధ్యత గలిగిన పదవిలో ఉన్న మహిళగా మీరు చేసిన వ్యాఖ్యలు, మా కుటుంబం పట్ల మీరు చేసిన ఆరోపణలు పూర్తిగా అసంబద్ధం, అబద్ధం అని నాగార్జున స్పష్టం చేశారు. తక్షణమే మీ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవలిసిందిగా కోరుతున్నాను అని కొండా సురేఖకు నాగార్జున పేర్కొన్నారు.

## రాష్ట్రంలో మూడు రోజులు భారీ వర్షాలు

మొదటి పేజీ తరువాయి

ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తాయని పేర్కొంది. రాష్ట్రంలోకి కిందిస్థాయి గాలులు ప్రధానంగా పశ్చిమ, వాయువ్య దిశల నుంచి వీస్తున్నట్టు తెలిపింది. ఈ క్రమంలోనే లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. బుధవారం ఉమ్మడి మెదక్, రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్, వరంగల్, నల్గొండ, ఖమ్మంతో పాటు కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది. అలాగే గురువారం ఉమ్మడి మెదక్, మహబూబ్‌నగర్‌తో పాటు వికారాబాద్, కామారెడ్డి జిల్లాల్లో మోస్తరు వానలు పడే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొన్నది.

తీన్మార్
తెలుగు దినపత్రిక

## పశ్చిమ ఆసియాలో యుద్ధమేఘాలు

హిజ్ బొల్లా పై ఇజ్రాయిల్ దాడులు చేస్తున్న నేపథ్యంలో పశ్చిమసియాలో యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలోనే సిరియాపై అమెరికా దాడులు మొదలు పెట్టింది. అమెరికా బలగాలు సిరియా పైన విరుచుకుపడుతున్నాయి. ఇప్పటివరకు తాము జరిపిన వైమానిక దాడుల్లో 37 మంది ఉగ్రవాదులు చనిపోయారని అమెరికా వెల్లడించింది. వీరంతా కూడా ఇస్లామిక్ స్టేట్ గ్రూప్, అల్ ఖైదా అనుబంధ సంస్థలకు చెందిన వారిని వివరించింది. చనిపోయిన వారిలో ఇద్దరు ఇస్లామిక్ స్టేట్ గ్రూప్ ఉగ్రవాద సంస్థకు చెందిన కీలక నాయకులు ఉన్నారని పేర్కొంది.. అల్ ఖైదా కు అనుబంధంగా ఉన్న హుర్రాస్ అల్ దీన్ గ్రూప్ కు చెందిన సీనియర్ ఉగ్రవాది.. మరో ఎనిమిది మందిని టార్గెట్ గా అమెరికా దాడులు చేసింది. వాయవ్య సిరియా ప్రాంతంలో వైమానిక దాడులు జరిపింది. ఈ దాడుల్లో 37 మంది హతమయ్యారు. అందులో ఓ సీనియర్ ఉగ్రవాది అమెరికాకు వ్యతిరేకంగా? ఇస్లామిక్ స్టేట్ గ్రూప్ కు చెందిన ఫైటర్లకు శిక్షణ ఇస్తున్నాడు. అయితే తమ నిఘా వర్గాల ద్వారా ఈ సమాచారం తెలియడంతో అమెరికా అప్రమత్తమయింది. వెంటనే దాడులకు రంగం సిద్ధం చేసింది. అత్యధిక ఆయుధ సామగ్రితో వైమానిక దాడులు చేసింది. ఈ దాడుల్లో ఇస్లామిక్ స్టేట్ గ్రూప్ శక్తి సామర్థ్యాలు పూర్తిగా దెబ్బతిన్నాయని అమెరికా వెల్లడించింది. " మా ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తే ఊరుకునేది లేదు. మిత్రపక్షలకు, భాగస్వాములకు వ్యతిరేకంగా కార్యకలాపాలు సాగిస్తే సహించేది లేదు. ప్రపంచ వ్యాప్తంగా శాంతికి విఘాతం కలిగించే పనులు చేస్తే ప్రతిఘటన తీవ్రంగా ఉంటుంది. ఇస్లామిక్ స్టేట్ గ్రూప్ మాత్రమే కాదు.. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే ఎవరికైనా ఇదే గతి పడుతుందని" అమెరికా హెచ్చరించింది. అయితే సిరియా నుంచి అమెరికా బలగాలు వెళ్లిపోయిన తర్వాత ఇస్లామిక్ స్టేట్ గ్రూప్ భారీగా భూభాగాన్ని తన ఆధీనంలోకి తీసుకుంది. అయితే ఇటీవల మళ్ళీ కార్యకలాపాలు ప్రారంభించినట్టు అమెరికాకు సమాచారం అందింది. దీంతో ఇస్లామిక్ స్టేట్ గ్రూప్ విస్తరించకుండా ఉండడానికి అమెరికా దాడులు మొదలు పెట్టింది. ఏకంగా 37 మంది ఉగ్రవాదులను హతమార్చినట్టు ప్రకటించింది. అమెరికా దాడులు నేపథ్యంలో సిరియాలో దాదాపు 900 మంది భద్రతా సిబ్బందిని నియమించింది. అక్కడ వారు విస్తృతంగా తనిఖీలు మొదలుపెట్టారు. ఉగ్రవాదులను హతమార్చుకుంటూనే.. బంకర్లు, సెల్లార్లు, ఇతర నిర్మాణాలలో ఉగ్రవాదుల జాడ కోసం తనిఖీలు చేస్తున్నారు. మొత్తంగా అటు హిజ్ బొల్లా పై ఇజ్రాయిల్ దాడులు చేస్తుండడం.. ఇస్లామిక్ స్టేట్ గ్రూప్ ఉగ్రవాదులను ఏరి పారేయడానికి అమెరికా సిరియాపై దాడులు చేస్తుండడంతో ప్రపంచ వ్యాప్తంగా ఉద్రిక్తత ఇజ్రాయిల్ దళాలు భీకర దాడులు చేస్తున్నాయి..హెజ్ బొల్లా ను కోలుకోకుండా బాంబుల వర్షం కురిపిస్తున్నాయి.. ఇప్పటికే హెజ్ బొల్లా చీఫ్ హసన్ నస్రల్లా ను హతమార్చినట్టు వార్తలు వినిపిస్తున్నాయి. దీనిని హెజ్ బొల్లా అధికారికంగా ఇంతవరకూ ధృవీకరించలేదు. మరోవైపు ఇజ్రాయిల్ సైన్యం అంతకంతకు దూకుడు కొనసాగిస్తోంది. బాంబుదాడులతో విరుచుకుపడుతోంది. ఈ క్రమంలో హెజ్ బొల్లా కు పరోక్షంగా అండదండలు అందించిన ఇరాన్ ఒక్కసారిగా అప్రమత్తమైంది. ఇజ్రాయిల్ తో గత అనుభవాల నేపథ్యంలో ఇరాన్ తన సుప్రీం నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ ని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అంతర్జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి..అంతర్జాతీయ సమాజం నుంచి ఒత్తిడి వస్తున్నప్పటికీ ఇజ్రాయిల్ ఏ మాత్రం వెనకడుగు వేయడం లేదు. లెబ నాన్ రాజధాని బీ రూట్ లో హెజ్ బొల్లా ప్రధాన కార్యాలయం పై ఇజ్రాయిల్ బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడులలో హెజ్ బొల్లా చీఫ్ నస్రల్లా చనిపోయినట్టు తెలుస్తోంది.. దీనిని ఇజ్రాయిల్ రక్షణ విభాగం ఇప్పటికే ధ్రువీకరించింది. హెజ్ బొల్లా చీఫ్ ఆ సమయంలో సమావేశం నిర్వహిస్తున్నట్టు ఇజ్రాయిల్ వర్గాలకు సమాచారం అందింది. దీంతో మరో మాటకు తావులేకుండా బాంబులతో దాడి చేసింది. బాంబుల దాడి వల్ల భవనం పూర్తిగా నేలమట్టం అయింది. " మేము అనుకున్న లక్ష్యం పూర్తయింది. భవనం పూర్తిగా నేలమట్టం అయింది. నస్రల్లా ఇకపై భయభ్రాంతులకు గురి చేయడు. ఉగ్రవాద కార్యకలాపాలు చేపట్టలేడు.. అతడు ఇక గతం తాలూకు జ్ఞాపకమే" అంటూ ఇజ్రాయిల్ వార్ రూమ్ ప్రకటించింది.."ఆపరేషన్ న్యూ ఆర్డర్" మిషన్ విజయవంతమైన ప్రకటించింది. నస్రల్లా కన్నుమూసిన నేపథ్యంలో పశ్చిమాసియాలో పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. ముఖ్యంగా హెజ్ బొల్లా తన మిత్రపక్షలతో అంతర్గత సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలుస్తోంది.. ఇజ్రాయిల్ వరుసగా దాడులు చేస్తున్న నేపథ ఖమేనీ అత్యవసరంగా తన నివాసంలో సుప్రీమ్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ తో సమావేశమయ్యారు. ఆ తర్వాత ఆయన ఒక సందేశం విడుదల చేశారు.."హెజ్ బొల్లా కు అండగా ఉండాలి. దాడులను ధైర్యంగా ఎదుర్కోవాలి.. ఈ ప్రాంతం భవిష్యత్తును దూకుడుగా ఉన్నవారు నిర్ణయిస్తారు.. అందులో హెజ్ బొల్లా మొదటి స్థానంలో ఉంటుందని" ఖమేనీ తన సందేశంలో పేర్కొన్నారు.. కాగా, ఇజ్రాయిల్ దాడుల నేపథ్యంలో హెజ్ బొల్లా కు తీవ్ర నష్టం వాటిల్లుతోందనే వార్తలు వినిపిస్తున్నాయి.. ఈ క్రమంలో ఇరాన్ నేరుగా ఇజ్రాయిల్ తో తలపడే అవకాశం కనిపిస్తోంది..లెబనాన్ కు తన దళాలను పంపిస్తోంది.."1981 మాదిరిగానే ఇజ్రాయిల్ దేశంతో నేరుగా పోరాడేందుకు తమ బలగాలను లెబ నాన్ కు పంపిస్తామని" ఇరాన్ ఉన్నతాధికారి అంతర్జాతీయ మీడియాతో వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో ఏ క్షణంలో ఏం జరుగుతుందోననే భయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

## సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### ఆత్మకూర్ ఏఎస్ఐ రోశయ్య

ఆత్మకూర్, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూర్ పట్టణ కేంద్రంలోని వాల్మీకి చౌరస్తాలో ఆత్మకూర్ పోలీస్ శాఖ సబ్ ఇన్స్పెక్టర్ నరేందర్ ఆధ్వర్యంలో ప్రజలకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ రోషయ్య మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల నుంచి మీ అకౌంట్ కు సంబంధించి వచ్చే ఫోన్ కాల్స్ ని నమ్మవద్దు అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటిపి వివరాలు అడిగితే తెలియచేయకూడదని వాట్సాప్ గ్రూపులో వచ్చే ఏపీకే ఫైల్స్ ని మన ఫోన్లో డౌన్లోడ్ చేసుకోకూడదని మీకు వాట్సాప్ లో వీడియో కాల్ చేసి మేము సైబర్ క్రైమ్ పోలీసులము మీరు సైబర్ క్రైమ్ చేశారు.మీ పై సైబర్ కేసు నమోదు చేస్తున్నాము అంటే నమ్మవద్దని వేక్ అప్ లాంటి నకిలీ యాప్ లో పెట్టుబడులు పెట్టరాదని హెల్ప్ లైన్ నెంబర్ ల కోసం గూగుల్ లో ఆన్లైన్లో ఒకసారి చేయకూడదని పలు సూచనలు సలహాలు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో పోలీస్



శాఖ సిబ్బంది రామకృష్ణ భీమయ్య జెపి గౌడ్ పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మ గాంధీ,మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి

### – సేవలు మరువలేనివి :మార్కెట్ కమిటీ చైర్మన్ గౌని ప్రమోదిని రెడ్డి

పెబ్బేరు, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): జాతిపిత మహాత్మా గాంధీ జయంతి, భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుదవారం పట్టణంలోని సుభాష్ చంద్రబోస్ చౌరస్తాలో వారి చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పెబ్బేరు మార్కెట్ యార్డు కార్యాలయం ముందు మార్కెట్ కమిటి చైర్మన్ గౌని ప్రమోదిని రెడ్డి వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటి చైర్మన్ గౌని ప్రమోదిని రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ దేశాలు గుర్తించిన మహోన్నత వ్యక్తి మహాత్మా గాంధీ అని, స్వాతంత్ర ఉద్యమంలో మహాత్మా గాంధీ పాత్ర ఎన్నటికీ మరువలేనిదని, ఆయన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని మార్కెట్ కమిటి చైర్మన్ గౌని ప్రమోదిని రెడ్డి అన్నారు. మహాత్మ గాంధీ చూపిన మార్గం శాంతి అహింస అనేవి ప్రజలను ఎన్నటికీ తప్పుదోవ పట్టించకుండా చూసే గొప్ప మార్గ నిర్దేశాలని ఆయన అన్నారు. కానీ ప్రస్తుతం దేశంలో మహాత్మా గాంధీ ని తక్కువ చేసే విధంగా కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహాత్మా గాంధీని తక్కువ చేసి గాంధీని చంపిన గాడ్సేను గొప్ప వ్యక్తిగా చూపించే



ప్రయత్నం చేస్తున్నారని, దానిని ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాల్సిన బాధ్యత ప్రజల పైన ఉందని ఆయన అన్నారు. అదేవిధంగా లాల్ బహదూర్ శాస్త్రి దేశానికి ప్రధానిగా ఎన్నో సేవలు చేశారని దేశం ఆర్థికంగా బలపడుతూ ముందుకు వెళ్లడానికి ఎన్నో సంస్కరణలు తీసుకు వచ్చారని, వారిద్దరి సేవలు ఎన్నటికీ మరువలేనివని అన్నారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి, జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్,పట్టణ అధ్యక్షులు కారుపాకుల వెంకట్రాములు, మార్కెట్ డైరెక్టర్లు రామన్ గౌడ్, మోతే రాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గంధం రంజిత్ కుమార్, గౌని యుగేందర్ రెడ్డి,జగదీశ్వర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి మన్నెం, మాజీ డైరెక్టర్ రాములు, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## 10 శాతం ల్యాండ్లపై సమగ్ర నివేదిక ఇవ్వాలి

### కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కమిషనర్ కు వినతి

ఆత్మకూర్, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూర్ మున్సిపల్ పరిధిలోని గత గ్రామపంచాయతీ ప్రభుత్వానికి ఇచ్చిన 10 శాతం భూములను ప్లాట్ రూపంలో ఇంటి నెంబర్లు ఇచ్చి మరియు హక్కుదారులుగా అసెస్మెంట్ పత్రాలు ఇచ్చి రిజిస్ట్రేషన్ బినామీ వ్యక్తులపై చేయించడం జరిగింది.

కోట్ల రూపాయలకు అవినీతి పాల్పడం జరిగింది ఇట్టి విషయంపై విచారణ చేసి న్యాయం చేయాలని అవినీతి అక్రమాలపై 10 శాతం ల్యాండ్లపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆత్మకూర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. ఇట్టి కార్యక్రమంలో ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మనీ వర్ధన్ రెడ్డి గంగాధర్ నాగేశ్వర్ గడ్డం శ్రీకాంత్



సంగేపాగ వంశీ, ఎండి రఫీక్ రమేష్ యాదవ్ గణేష్ ముదిరాజ్ అంజి రామకృష్ణ యాదవ్ పరమేష్ కృష్ణ కాంత్ ఎండి షంషీర్ ఆనంద్ సాయి చింటూ తదితరులు పాల్గొన్నారు.

## మూలమలలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

ఆత్మకూర్, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం పరిధిలోని మూలమల్ల గ్రామంలో మహాత్మా గాంధీ జయంతి జన్మదిన వేడుకల్లో ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సెక్రటరీ జైపాల్ రెడ్డి గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం స్థానిక మండల ఉన్నత పాఠశాల ఆవరణంలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఇట్టి కార్యక్రమంలో ఆత్మకూర్ కిసాన్ సెల్ మండల అధ్యక్షులు వినయ్ కుమార్ రెడ్డి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి.రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు ఏ.సుధాకర్, ఉపాధ్యక్షులు ఎంపిటిసి లక్ష్మన్న నాయకులు



సహదేవుడు ఆనంద్ గౌడ్ నరేష్ సత్యన్నా ఖాసీం యా%శీ%కే రాము దండు నాగేష్ కావలి శేఖర్, రాజు, లక్ష్మన్న, శేఖర్ కార్యకర్తలు గ్రామ పెద్దలు గడ్డం భీమన్న తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ. 50 వేలు విరాళాలు

### స్థానిక సీఐకి విరాళాలు అందజేసిన గ్రామస్తులు

ఆత్మకూరు, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశాల మేరకు ఆత్మకూరు మండల పరిధిలోని ప్రతి గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల గ్రామాలలో మరింత భద్రత శాంతి భద్రతలు మెరుగుపడే అవకాశం ఉంటుందని ఆత్మకూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శివకుమార్ సబ్ ఇన్స్పెక్టర్ నరేందర్ అన్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని బాలకిష్టాపూర్ గ్రామస్తులు స్వచ్ఛందంగా గ్రామ పెద్దల సహకారంతో గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు 50 వేల రూపాయలను విరాళాలు సేకరించి బుధవారం రోజు స్థానిక సీఐ మరియు ఎస్ఐలకు విరాళాలను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులను ఆత్మకూరు పోలీస్ శాఖ వారి తరఫున




ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మరియు ఎస్ఐలు మాట్లాడుతూ ప్రతి గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఒక్కో సిసి కెమెరా 100 మంది పోలీసులతో సమాన మని శాంతి భద్రతలు కల్పిస్తుందని ఈ సందర్భంగా వారు అన్నారు.

## శ్రీనగర్ కాలనీ సమస్యలను పరిష్కరించాలి

కంఠేశ్వర్ : నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని అమ్మ వచర్ స కు మార్గంలో శ్రీనగర్ కాలనీ ప్రాంతంలో శ్రీనగర్ కాలనీ సమస్యలను పరిష్కరించాలని శ్రీనగర్ కాలనీ వాసులు టెంట్ వేసుకొని మరి రోడ్డును బ్లాక్ చేసి నిరసనకు దిగారు. ఈ మేరకు బుధవారం తమ కాలనీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జాతిపిత గాంధీ జయంతి రోజున నగరంలోని శ్రీనగర్ కాలనీవాసులు శాంతి మార్గంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. గాంధీజీ చిత్రంతో ఫ్లెక్సీని రూపొందించి దానిపై తమ కాలనీ సమస్యలను వివరించారు. అర్బన్ నియోజకవర్గంలో ఉన్నప్పటికీ శ్రీనగర్ రోడ్డు నం.3 కాలనీ నిరాదరణకు గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

## గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుంది



### ఎంఎల్ఏ రేవూరి ప్రకాశ్ రెడ్డి

ఆత్మకూరు, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): ఆత్మకూరు మండలం హౌస్ బుజ్జూర్ గ్రామంలో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ని స్విచ్ ఆన్ చేసి లైటింగ్ సిస్టమ్‌ను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామల అభివృద్ధి జరుగుతుందని, ఎన్నికలల్లో ఇచ్చిన ప్రతి హామీలను నెరవేరుస్తామని అన్నారు.

## డీఎస్సీ ర్యాంక్ సాధించిన విద్యార్థిని భాగ్యలక్ష్మి



### సన్మానించిన మాజీ మార్కెట్ ఛైర్మన్ గౌని బుచ్చారెడ్డి

పెబ్బేరు, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): మొన్న వెలువడిన డీఎస్సి ఫలితాల్లో పెబ్బేరు పట్టణానికి చెందిన పి.ఆంజనేయులు కుమార్తె భాగ్యలక్ష్మి 12వ ర్యాంక్ సాధించింది. పెబ్బేరు పట్టణానికి చెందిన నిరుపేద విద్యార్థిని భాగ్యలక్ష్మి డీఎస్సీలో 12వ ర్యాంక్ సాధించడం పట్ల స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. భాగ్యలక్ష్మిని వారి నివాసంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ గౌని బుచ్చారెడ్డి శాలువా కప్పి సన్మానించారు. మున్ముందు ఉన్నతమైన చదువులు చదివి మంచి ఉద్యోగ సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కో అప్షన్ ఎండి.ముస్తాక్, జనకిరాములు, ఎండి.ఖాజా, పి.వేంకటేశ్వర్లు, బాలరాజు, ఎండి.నిజాం, రాజా గౌడ్, విజయ్ కుమార్, ఎండి.మైబూబ్, కృష్ణ కుమార్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు

## ఎంపీడీవో ఆఫీసులో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



పాలకవీడు, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): సూర్యాపేట జిల్లా పాలకవీడు మండల కేంద్రంలోని ఎంపీడీవో ఆఫీసు నందు బుధవారం రోజున గాంధీ జయంతి సందర్భంగా ఎంపీడీవో జీ లక్ష్మి, గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సత్యాగ్రహం అహింస మార్గంలో భారతదేశానికి స్వతంత్రం తీసుకొచ్చిన మహనీయుడు అని ఆయన చూపిన మార్గం నేటి యువతకు ఆదర్శప్రాయం అని అన్నారు. ఎపిఓ రాజు, కార్యాలయ సిబ్బంది – పి ఎం ఎల్ నర్సింహా రావు, గురుస్వామి, కల్పన, మహేష్,సైదులు, ఇ జి యస్ సిబ్బంది నాగరాజు, అన్వేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

## మంత్రి వర్యులు సీతక్క పర్యటన విజయవంతానికి నాయకులకు పిలుపు

### – మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైల జయరామ్ రెడ్డి



మంగపేట, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): గురువారం రోజునా మధ్యాహ్నం 01.00 గంటలకు మంగపేట మండల కేంద్రంలోని బస్ స్టేషన్ ప్రారంభోత్సవం కార్యక్రమం, 01.40 గంటలకు రైతు వేదికలో పోషకహరక సమావేశం నిర్వహించను న్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క హాజరుకానున్నారు. కావున ఈ కార్యక్రమనికి మండలంలోని జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, మండల నాయకులు, అన్ని అనుబంధ సంఘాల ( యస్సి, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కిసాన్ కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, నాయకులు, గ్రామ నాయకులు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు తప్పక హాజరు కావాలని కోరారు.

# మున్సిపల్ ఆఫీస్లో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

♦ శాంతి అహింసా మార్గములకు మారు పేరు గాంధీజీ

♦ మున్సిపల్ చైర్ పర్సన్ గాయత్రి రవి కుమార్ యాదవ్



ఆత్మకూర్, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూర్ పురపాలక సంఘం కార్యాలయంలో నేడు గాంధీ జయంతి వేడుకలను మున్సిపల్ చైర్ పర్సన్ గాయత్రి రవి కుమార్ యాదవ్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి బ్రిటిష్ వారి దాస్య శృంకలాలను తెంచడం మరియు భారత దేశ స్వాతంత్ర్యం కోసం అహింసా మార్గంలో పోరాడి దేశానికి స్వేచ్ఛను ప్రసాదించారని కొనియాడారు.ప్రతి సంవత్సరం గాంధీ జయంతి సందర్భంగా వారిని స్మరించుకోవడం ఆనందంగా ఉందని, అలాగే గాంధీ కలలు కన్న స్వరాజ్య స్థాపణలో ప్రతీ ఒక్కరూ నడుం బిగించాలని, గ్రామాలు దేశానికి పట్టుగొమ్మలు అని ఆనాడే గాంధీ సూచించారని, ఇట్టి అభివృద్ధి పనులకు ప్రజా ప్రతినిధులు అందరూ కలసికట్టుగా శ్రమించాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం కార్యాలయం నుండి గాంధీ చౌక్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా సిబ్బంది చే స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించి కౌన్సిలర్లతో కలిసి శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ విజయభాస్కర్ రెడ్డి కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు ఆర్పీలు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జయంతి వేడుకల్లో గాంధీ విగ్రహాన్ని పట్టించుకోని అధికారులు





నేరేడుచర్ల, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): స్థానిక నేరేడుచర్లలో గాంధీ జయంతి రోజున తెలంగాణ ప్రభుత్వం గాంధీ జయంతిని రాష్ట్ర వేడుకగా ప్రకటించిన నేపథ్యంలో ప్రభుత్వంలోని వివిధ శాఖలకు బడ్జెట్ నుంచే జయంతి వేడుకల నిర్వహణ ఖర్చును విడుదల చేసినా రోడ్ వైండింగ్ లో తీసినటువంటి గాంధీ విగ్రహాన్ని మండల తహసీల్దార్ కార్యాలయం నందు పెట్టడం జరిగింది. అట్టి విగ్రహాన్ని చెట్లు పిచ్చి మొక్కల్లో పడి ఉన్నటువంటి విగ్రహాన్ని ఈరోజు హుజూర్నగర్ నియోజకవర్గం బి అర్ యస్ నాయకులు రాపోలు నవీన్ కుమార్ చెట్లను తొలగించి పాలాభిషేకం చేసి జయంతి కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో జీలకర్ర రామస్వామి, కర్రీ సతీష్ రెడ్డి, జింకల భాస్కర్, షేక్ ఇంతియాజ్, ఎమ్అర్ పి యస్ నాయకులు యడవెల్లి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీకి ఘన నివాళ్ళర్పించిన మండల కాంగ్రెస్ నాయకులు



పాలకవీడు, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): సూర్యాపేట జిల్లా పాలకీడు మండల కేంద్రంలో బుధవారం నాడు గాంధీ జయంతి సందర్భంగా జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించిన మండల కాంగ్రెస్ నాయకులు, మండల పార్టీ అధ్యక్షుడు ఎన్ వి సుబ్బారావు, మాజీ ఎంపీపీ భూక్య గోపాల్ నాయక్, మాజీ జెడ్పిటిసి బుజ్జి మోతిలాల్ నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహారావు, మున్సిపల్ కౌన్సిలర్ జితేందర్ రెడ్డి, ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ శాంతి, అహింస మార్గంలో పోరాడి దేశ ప్రజలకు స్వతంత్రాన్ని అందించిన జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి ఘన నివాళులర్పిస్తున్నాము అని అన్నారు. బాపూజి ఆశయాల సాధన కోసం మనమందరం కృషి చేయాలని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో, జిల్లా ప్రధాన కార్యదర్శి సైదా నాయక్, యూత్ నాయకులు శేషిరెడ్డి, శ్రీకాంత్, సుబ్బు గౌడ్, కిషన్ నాయక్, పెరుమాళ్ళ రమేష్, వినోద్, అల్లావుద్దీన్, జార్జ్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

– అహింస మార్గంలోనే దేశానికి స్వాతంత్ర్యం

– బీసీ పొలిటికల్ జేఏసీ మండల అధ్యక్షుడు మహేందర్ నాయుడు



దేవరకద్ర, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): జాతిపిత మహాత్మా గాంధీ చూపిన సత్యం, ధర్మం, అహింసా మార్గంలోనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని బీసీ పొలిటికల్ జేఏసీ మండల అధ్యక్షుడు మహేందర్ నాయుడు అన్నారు. వనపర్తి జిల్లా మదనాపురం మండలం అజ్జకొల్లు గ్రామ పంచాయతీ ఆవరణంలో జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీసీ పొలిటికల్ జేఏసీ మండల అధ్యక్షుడు మహేందర్ నాయుడు మాట్లాడుతూ గాంధీ అహింస మార్గంతోనే దేశానికి స్వాతంత్ర్యం సాధించామని, ప్రతిఒక్కరూ మహాత్ముడిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగినప్పుడే దేశం సర్వోన్నతి చెందుతుందన్నారు. భారత జాతిపిత మహాత్మాగాంధీ స్వాతంత్ర్య సమర యోధుడుగా, అహింసావాదిగా, యావత్ భారతాన్ని ప్రభావితం చేసిన వక్తిత్వం కలిగిన వారు గాంధీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి పంచాయతీ కార్యదర్శి టి.ఏ భరత్ కుమార్, మండల బిజెపి అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మండల సిపిఎం కార్యదర్శి వెంకట్రాములు, నాయకులు కురువ చంద్రమ్మ, పెద్ద వెంకటరెడ్డి, వడ్డే రాజు చంద్రన్న గౌడ్, దేవేందర్ ఏ.రాజు, సుతారం చెన్నయ్య , శివ, కురువ విష్ణు, కృష్ణయ్య, బీసన్న, కావలి శ్రీనివాసులు, తెలుగు రాములు, బుచ్చన్న,బాలస్వామి మరియు అంగన్వాడి టీచర్లు, ఏఎన్ఎం తోపాటు ఆశ వర్కర్లు, గ్రామపంచాయతీ వర్కర్లు తదితరులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# గాంధీ ఆశయ సాధన కోసం కృషి చేయాలి

గ్రేటర్ వాసవి క్లబ్ అధ్యక్షుడు గేల్లీ సతీష్ కుమార్

ఘనంగా గాంధీ జయంతి వేడుకలు




గరిడేపల్లి, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): గాంధీ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గ్రేటర్ వాసవి క్లబ్ అధ్యక్షుడు గేల్లీ సతీష్ కుమార్ అన్నారు. మండల కేంద్రమైన గరిడేపల్లిలో గ్రేటర్ వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం జాతిపిత మోహన్ దాస్ కరంచంద్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నమ్మిన భావాలను ఏనాడు విస్మరించలేదన్నారు సత్యం అహింస సత్యాగ్రహం అనే వాటిని జీవితకాలమంతా నమ్మి ఆచరించిన మహోన్నతమైన వ్యక్తి గాంధీజీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పైడిమర్రి రంగనాథ్, సుధా బ్యాంకు మేనేజర్, వాసవి క్లబ్ సెక్రటరీ ఇలింద్ర సురేష్, కోశాధికారి ఈగ వెంకటేశ్వర్లు, ముచ్చర్ల గోపాలకృష్ణ, తాటికొండ లక్ష్మణ్, పోలిశెట్టి వీరప్రసాద్, బూరుగు శంకర్ శ్రీరంగం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఘనంగా ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు



హన్మకొండ జిల్లా, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో అతిపెద్ద పండుగ, పూలనే పూజించే సాంస్కృతిక పండగ బతుకమ్మ పండుగ అని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి సతీమణి నీలిమ రెడ్డి, కుమార్తె గోదా రెడ్డి అన్నారు. ఎంగిలి పూల బతుకమ్మ పురస్కరించుకొని బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 9రోజులు తీరొక్క పూలతో తెలంగాణ సాంస్కృతి సంప్రదాయాలు ప్రతిభింభించేలా ఈ పండుగ జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.ఈ పండుగ అందరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని కోరుకున్నారు. సనాతన ధర్మాన్ని పాటిస్తూ ఎన్నో వందల ఏళ్లుగా వస్తున్న సద్దుల బతుకమ్మ, దసరా పండుగ జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

# వయో వృద్ధులకు అండగా నిలవాలి

– వారిని ప్రేమతో గౌరవంగా చూసుకోవాలి

– ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్. రామచంద్రా రావు






జయశంకర్ భూపాలపల్లి జిల్లా, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): వయస్సు పైబడిన పెద్దలను ప్రేమతో గౌరవంగా చూసుకోవాలని, వారికి అండగా నిలవాలని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్. రామచంద్రా రావు అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక వృద్ధాశ్రమంలో బుధవారం ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా జడ్జి గారు మాట్లాడుతూ పెద్దవయసు వారు ప్రేమ, మర్యాద, ప్రశాంతతిని, తప్ప ఏమి ఆశించరు అని అన్నారు. వారి ఆరోగ్యం బాగుండాలంటే మానసిక ప్రశాంతతని, మనో ధైర్యాన్ని అందించాలని పిలుపునిచ్చారు. గాంధీ జయంతి రోజున పెద్ద వయస్సు వారితో గడపడం వారితో మనస్సు విప్పి మాట్లాడటం సంతోషంగా ఉందని జడ్జి అన్నారు. వయోవృద్ధుల ఆరోగ్యం బాగుండాలనే మంచి ఉద్దేశంతో జిల్లా న్యాయసేవాధికార సంస్థ హెల్త్ క్యాంపు నిర్వహించడం అభినందనీయం అని జడ్జి అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది మంగళపల్లి రాజ్ కుమార్, మెడికల్ ఆఫీసర్ సంపత్, వృద్ధాశ్రమ నిర్వాహకురాలు శైలజ, పారా మెడికల్ సిబ్బంది, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక స్వావలంబన కోసమే మహిళా శక్తి కార్యక్రమం

– రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు

– మహదేవ్ పూర్, కాటారం మండలాలలో మహిళా శక్తి క్యాంటీన్లు ప్రారంభం

పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): మహిళల ఆర్థిక స్వావలంబనకు, సమాజంలో మహిళా శక్తిని ముందుకు తీసుకెళ్లడమే ముఖ్య ఉద్దేశ్యంగా మహిళా శక్తి క్యాంటీన్లు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం మహదేవ్ పూర్ మండలకేంద్రంలోనీ కొమురం భీం సెంటర్ లోను, కాటారం మండలం కొత్తపల్లి వద్ద జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్లు మంత్రి శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ప్రారంభించారు. అనంతరం మహిళలు తయారు చేసిన వంటకాలను రుచి చూశారు. కాటారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహత్మా గాంధీ విగ్రహాన్ని మంత్రి శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ రాహుల్



శర్మ, ఎస్పి కిరణ్ ఖరేలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ మహిళా శక్తి కార్యక్రమం ద్వారా గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రోత్సాహం ఇవ్వడమే కాకుండా, సమాజంలో మహిళా శక్తిని ముందుకు తీసుకెళ్లడమే ముఖ్య ఉద్దేశ్యంగా మహిళా శక్తి కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. మహిళా శక్తి క్యాంటీన్లు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను కల్పించడంలో ఒక పెద్ద మైలురాయిగా నిలుస్తాయని, ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పునాది వంటిదని అన్నారు. ఈ క్యాంటీన్ల ఏర్పాటు ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందుతూ, స్థానిక ఆహార ఉత్పత్తులను ప్రోత్సహించడానికి దోహదపడతారని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ క్యాంటీన్ల ప్రాముఖ్యత, మహిళల జీవితాల్లో మార్పు తీసుకువచ్చే విధానాలు, మహిళా శక్తి పెంపుదలకు ఈ కార్యక్రమం ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు. జిల్లాలోని మహిళలు మహిళా శక్తి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, కాటారం సబ్ కలెక్టర్ మాయాంక సింగ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిఆర్డిఓ అవినాష్, డిపిఓ నారాయణ రావు,మహాదేవపూర్ కాటారం మండలాల తహసిల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# వందకు చేరిన సన్నబియ్యం..

హైదరాబాద్: సన్న బియ్యం ధర కిలో రూ.వందకు చేరనుందా..? కూరగాయల ధరలూ కిలో రూ.80 పైనే వుండబోతున్నాయా..? ఇప్పటికే రూ.220 పైగా ఉన్న వంట నూనెలు మరింత వేడెక్కుతా యా?? అంటే అవుననే అంటున్నాయి మార్కెట్ వర్గాలు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తోన్న పాలసీలతో సామాన్యుల నెత్తిన ధరల పిడుగు పడుతోంది. నిత్యావసర ధరలు రోజు, రోజుకీ పెరిగిపో తుండడంతో సామాన్య, మధ్య తరగతి జీవులకు కుటుంబ పోషణ భారమవుతున్న దయనీయ స్థితి ఎదురవుతోంది.గతేడాది జూన్ నుంచి సన్నబియ్యం ఎగుమతులపై ఉన్న నిషేధాన్ని కేంద్ర ప్రభుత్వం తొలగిం చింది. ధీంతో ఇకపై తెలంగాణ మిల్లర్లు సన్న బియ్యాన్ని అమెరికా, ఇంగ్లాండ్, దుబాయ్, థాయిలాండ్, మలేషియా వంటి దేశాలకు స్వేచ్ఛగా ఎగుమతి చేస్కోవచ్చు. దాదాపు 145 దేశాల్లో మన సన్న బియ్యానికి డిమాండ్ ఉంది. సన్న బియ్యం విదేశాలకు ఎగుమతి చేస్తే అధిక ధర, లాభాలు వస్తుండడంతో స్థానికంగా సన్న లభ్యత తగ్గనుంది. ఇప్పటికే బహిరంగ మార్కెట్లో సన్న బియ్యం ధర కిలో రూ.60 నుంచి రూ.70 కి చేరింది. తాజా పరిణామాలతో ఈ ధర అతి త్వరలో రూ.వంద కి చేరడం ఖాయంగా కనిపిస్తోంది.రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సామాన్యులకు అందుబాటు ధరలో సన్న బియ్యం ఉండేలా నియంత్రణ చేపట్టాలనే డిమాండ్ వస్తున్నా, మిల్లర్ల లాబీని ప్రభుత్వం నియంత్రిచడం సాధ్యమయ్యే పనేనా అనే సందేహం వెల్లడవుతోంది. బియ్యం ధరలు చుక్కల్లోకి చేరితే కూరగాయల, వంట నూనెల ధరలూ అదే బాటలో ఉన్నాయి. కూరగాయల సాగు డిమాండ్ మేర లేకపోవడం, దిగుబడులు లేకపోవడంతో వాటి ధరలు పల్లెలు, చిన్న పట్టణాల్లోనే కిలో రూ.60 నుంచి రూ.80 వరకు ఉంటే హైదరాబా ద్, వరంగల్, కరీంనగర్ లలో రూ.80 నుంచి రూ.100 వరకు పలుకుతున్నాయి. రైతు బజార్లను ఏర్పాటు చేసినా వాటిల్లోనూ దళారీలు,వ్యాపారులే తిష్ట వేయడంతో ధరలకి నియంత్రణ లేకుండా పోయింది. వంట నూనెల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. వేరుశనగ, పొద్దుతిరుగుడు నూనెలు సామాన్యులకు అందడం లేదు. కిలో రూ.200 , రూ.230 కి వీటి ధరలు చేరాయి. రీఫైండ్ ఆయిల్స్ పేరుతో రేట్లు అడ్డగోలుగా పెంచినా ప్రభుత్వం నియంత్రించలేక పోతోంది.పామాయిల్ ధర సైతం కిలో రూ.130 వరకు చేరింది .నిత్యావసర వస్తువుల ధరలన్నీ అడ్డగోలు గా పెరిగిపోతుండడంతో బతుకు భారమైన సామాన్యులు వీటిని రేషన్ దుకాణాల ద్వారా కనీస ధరకు అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

## బాక్సర్ అఖిల్ గౌడ్ను అభినందించిన మాజీ చీఫ్ విప్



హన్మకొండ, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): బాక్సింగ్ జాతీయ స్థాయి పోటిల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన బాక్సర్ అఖిల్ గౌడ్ను మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ అభినందించారు. వడ్డేపల్లి నివాసంలో బుధవారం రోజున అఖిల్ గౌడ్ను శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కాగా తమిళనాడు చెన్నైలో ఇటీవల సీబీఎస్సీ క్లస్టర్ - అండర్ 17 విభాగం జాతీయ స్థాయి బాక్సింగ్ పోటిల్లో అఖిల్ రజితం గెలిచారు. ఈ సందర్బంగా కోచ్ ప్రవీణ్, తల్లిదండ్రులను శ్రీకాంత్ దంపతులను అభినం దించారు. అఖిల్ ప్రస్తుతం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ 1 ఇయర్ చదువుతున్నాడు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్, భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు దాస్యం విజయ్ భాస్కర్, అరవింద్ ఆర్య, పేరిణి అశోక్ ఉన్నారు

## 4వ బెటాలియన్లో ఘనంగా మహాత్మా గాంధీ జయంతి వేడుకలు



మామునూర్, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): వరంగల్ జిల్లా మామునూరులోని నాలుగవ బెటాలియన్ ఆవరణలో జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను కమాండెంట్ బి.రామ్ ప్రకాష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కమాండెంట్ మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కమాండెంట్ మాట్లాడుతూ అహింసా మార్గంలో స్వాతంత్రోద్యమాన్ని నడిపించి బానిస సంకెళ్లు తెంచి బ్రిటిష్ పాలకుల నుంచి దేశానికి విముక్తి కలిగించిన మహాత్ముడి బోధనలు నేటి తరానికి ఆదర్శనీయమని అన్నాడు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు కృష్ణ ప్రసాద్, శ్రీనివాస్ రావు, వీరన్న, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు శోభన్, రవి, పురుషోత్తం రెడ్డి, సర్వర్, వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్, అశోక్, కృష్ణ, అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీ కాలనీలో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు



### ఆట పాటలతో.. డీజే మోతలతో ప్రారంభమైన బతుకమ్మ పండుగ

పరకాల, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): హన్మకొండ జిల్లా పరకాల పట్టణ కేంద్రంలోని బీసీ కాలనిలో తొమ్మిది రోజుల బతుకమ్మ పండుగలో భాగంగా మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలను కాలనీ ఆడపడుచులు తీరొక్క పూలను కూర్పుగా చేసి.. బతుకమ్మను పేర్చి.. పిల్లా జిల్లా బతుకంతా చల్లంగా ఉండాలని పూలను పూజిస్తూ.. ఆట పాటలతో.. డీజే మోతలతో ఘనంగా జరుపుకున్నారు.

## పాపం యువజంట

ఖమ్మం: చదువుకోని వాళ్లు మాయగాళ్ల వలలో పడుతున్నారంటే జాలీ పడవచ్చు..! కానీ చదువుకుని డిగ్రీలు చేత పట్టుకుని ఉద్యోగాల కోసం లక్షల్లో డబ్బులు కట్టి మోసపోతున్నారు. కట్టిన డబ్బులు తిరిగిరాక, ఉద్యోగం రాదని తెలిసి ఆ దంపతులు కుంగిపోయారు. చివరికి అవమాన భారంతో దంపతలిద్దరూ బలవన్మరణానికి పాల్పడ్డారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండలం, సాయిరాంతండాకు చెందిన హాలవత్ రత్నకుమార్, పార్వతీ యువ జంట కొత్తగూడెంలోని ఒక వస్త్రాలయంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. సింగరేణిలో ఉద్యోగం చేయాలని భావించారు. ఇందుకు మధ్య దళారిని నమ్మారు. ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పిన కరీంనగర్కు చెందిన వ్యక్తి మాయలో పడ్డారు. నెల నెలా కొంచెం డబ్బు కూడబెట్టి, 16 లక్షలు పోగు చేసిన సొమ్మును అతనికి అప్పజెప్పారు. ఉద్యోగం కోసం ఎదురు చూడసాగారు. ఇంతలోనే కరీంనగర్ చెందిన సదరు వ్యక్తి రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. దీంతో దిక్కుతోచనిస్థితిలో పడ్డారు ఆ దంపతులు. ఉద్యోగం ఇప్పిస్తానన్న వ్యక్తి మృతి చెందడంతో చేసేదీ లేక, ఇచ్చిన డబ్బులు తిరిగిరావని తెలుసుకుని ఆత్మహత్యే శరణ్యం అనుకున్నారు. ఇద్దరూ పురుగు మందు సేవించి అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. దీంతో విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వారిని కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్కు తరలించారు.

## మహాత్మా గాంధీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి





### జిల్లా కలెక్టర్ దివాకర టీ. ఎస్

ములుగు జిల్లా, సెప్టెంబర్ 02 (తీన్మార్ న్యూస్): బుధవారం మాహాత్మాగాంధీ జయంతి సందర్భంగా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన గాంధీ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం జిల్లా కేంద్రం లోని గాంధీ పార్కు వద్ద గల గాంధీ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాంతి,అహింస, సత్యాగ్రహం ఆయుధాలుగా సత్ మర్గములో దేశానికి స్వాతంత్ర్య తెచ్చిన మహానీయుడు మహాత్మగాంధీ అని కొనియాడారు. వారు చూపిన మార్గములో పయణించి దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్లాలని అన్నారు. అనంతరం ములుగు ఏరియా ఆసుపత్రిలోని పేషెంట్లకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇంచార్జ్ అదనపు కలెక్టర్, (లోకల్ బాడీ) సంపత్ రావ్, ములుగు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్లాల్, ఏరియా ఆసుపత్రి సూపరిడెంట్ జగదీష్, కలెక్టరేట్ పరిపాలన అధికారి అల్లం రాజ్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టర్ అధ్యక్షతన మహాత్మా గాంధీ జయంతి వేడుకలు

మహబూబాబాద్ జిల్లా, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధ్యక్షతన మహాత్మా గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ జయంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావులి హాజరయ్యారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథి ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, మాట్లాడుతూ అతి సామాన్య కుటుంబంలో జన్మించి ప్రపంచంలో అత్యున్నతమైన యూనివర్సిటీ నుండి లా డిగ్రీ పూర్తి చేశారని, భారతదేశ స్వతంత్ర ఉద్యమంలో తెల్లవారి పై శాంతి, అహింస మార్గాల ద్వారా దేశ ప్రజలను చైతన్యపరిచి స్వాతంత్రం సాధించడంలో కీలక భూమిక పోషించారని ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో గాంధీజీ గురించి ఎంత మాట్లాడినా తక్కువే అవుతుందని, స్వతంత్ర ఉద్యమంలో ఆయన చేసిన ఉద్యమాలు వెలకట్టలేనివాన్నారు. మహాత్ముల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను జరుపుకోవడం ద్వారా వారు చేసిన సేవలను ఎప్పటికీ స్మరించుకోవచ్చన్నారు. జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో భారతదేశానికి అత్యున్నతమైన పేరు ఉందని అందులో



గాంధీజీ చూపిన మార్గాలు ఎందరికో ఆదర్శప్రాయం అని, ఆయన జీవన ప్రమాణాలు, మార్పు, నీతి, నిజాయితీ, శాంతి, అహింస, ఆయన జీవితమే ఒక మెసేజ్ గా సిద్ధాంతంగా ముందుకు సాగాలని కలెక్టర్ కోరారు. అంతకు ముందు మహబూబాబాద్ పట్టణంలోని గాంధీ పార్క్ లో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ జయంతి వేడుకలలో అదనపు కలెక్టర్లు స్థానిక సంస్థలు, రెవెన్యూ, లెనిన్ వత్సల్ టోప్పో, డేవిడ్, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, జిల్లా అధికారులు కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## "మూటలో మహిళా శవం".. వీడిన హత్య కేసు మిస్టరీ

### అక్రమ సంబంధమే అంతం చేసింది

శంషాబాద్: మూటలో మహిళను చంపి ఆమె శవాన్ని బ్లాంకెట్లో చుట్టి ప్లాస్టిక్ కవర్లో డ్రైనేజీ పక్కన పడేసిన మహిళా హత్య కేసు మిస్టరీలో షాద్ నగర్ పోలీసులు పురోగతి సాధించారు. కేవలం మూడు రోజుల్లోనే కేసులోని మిస్టరీని ఛేదించి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో సంచలనం సృష్టించిన "మూటలో మహిళా శవం" హత్య కేసు వివరాలను షాద్ నగర్ ఏసిపి ఎన్.సిహెచ్ రంగస్వామి మంగళవారం మీడియాకు వెల్లడించారు. చెడు వ్యసనాలే ప్రమాదకరం

గత నెల 27వ తేదీ రాత్రి అంబేద్కర్ కాలనీలో నివాసం ఉంటున్న ఒంటరి మహిళ కన్నా భాగ్యలక్ష్మి అలియాస్ లక్ష్మి (40) హత్యకు గురైంది. ఆమె శవాన్ని ఓ బ్లాంకెట్ లో చుట్టి ప్లాస్టిక్ కవర్లో వేసి ఫరూక్ నగర్ శ్రీనివాస కాలనీలో ఓ డ్రైనేజ్ పక్కన మూటగట్టి పడేశారు. పోలీసులకు సమాచారం అందజేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు.. చెడు వ్యసనాలకు అలవాటు పడి దురాశతో కన్నా భాగ్యలక్ష్మిని గద్వాల జిల్లా చాగాపురం గ్రామానికి చెందిన వడ్డే పరమేష్ (43) ఆమెతో అక్రమ సంబంధం ఏర్పాటు చేసుకొని ఆ తర్వాత అరతులం బంగారం కోసం ఆశపడి ఆమెను గొంతు పిసికి హత్య చేశాడని ఏసీపీ వివరించారు.

కన్నా భాగ్యలక్ష్మి 27వ తేదీ రాత్రి 10 గంటలకు వడ్డే పరమేష్ తో కలిసి ఇంటికి చేరుకుంది. అంబేద్కర్ కాలనీలో నివాసం ఉంటున్న ఒంటరి మహిళ భాగ్యలక్ష్మి రాత్రి 10 గంటల తర్వాత భోజనం చేసిన అనంతరం 11 గంటల సమయంలో నిందితుడు వడ్డే పరమేష్ భాగ్యలక్ష్మి గొంతు పిసికి అరవకుండా ఆమె నోరు మూసి హత్య చేశాడు. తరువాత ఆమె చెవి కమ్మలు, పూస్తే, 5000 రూపాయల నగదు దోచుకుని ఫ్యాషన్ బైక్ పై వెళ్లిపోయినట్లు పోలీసులు గుర్తించారు. ఆమె శవాన్ని ఒకరగ్గులో చుట్టి ప్లాస్టిక్ కవర్లో పెట్టుకొని డ్రైనేజీ పక్కన పడేసి వెళ్లిపోయినట్లు పోలీసులు వెల్లడించారు. అనేక సీసీ కెమెరాలు పరీక్షించి ఆ తర్వాత కొన్ని ఆధారాలతో నిందితుడు అద్దెకు ఉంటున్న యాదవ కాలనీలో ఓ ఇంట్లో వడ్డే పరమేష్ ను గుర్తించినట్టు తెలిపారు. సాంకేతిక ఆధారాలు ఇతర ఆధారాలతో వడ్డే పరమేష్ ను అదుపులోకి తీసుకొని ఈరోజు అరెస్టు చేయడం జరిగిందని ఏసీపీ తెలిపారు.

## ప్రతి ఒక్కరు స్వేచ్ఛ స్వాతంత్రాలు కలిగి ఉన్నప్పుడే నిజమైన స్వాతంత్రం



నల్లగొండ కలెక్టరేట్: సమాజంలో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు కలిగి ఉన్నప్పుడే నిజమైన స్వాతంత్రం వచ్చినట్లు అని, అందుకోసమే గాంధీ మహాత్ముడు కృషి చేశారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. నాగరాజు అన్నారు. గాంధీ జయంతి, ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం నల్గొండ జిల్లా జైలులో ఏర్పాటు చేసిన ఖైదీల సంక్షేమ దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఆయన జైలు ఆవరణలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జైలులో ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా జడ్జి మాట్లాడుతూ చెడును వదిలి మంచి మార్గంలో పయనించడానికి ప్రతి ఒక్కరూ సమాజానికి అనుగుణంగా ఉండాలని అన్నారు. చేసిన తప్పు మళ్ళీ చేయకుండా, తప్పును సరిదిద్దుకొని సమాజానికి ఉపయోగపడే విధంగా సత్ప్రవర్తన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని ఖైదీలకు సూచించారు. జైలులో ఖైదీలకు అన్ని సౌకర్యాలు ఉన్నాయని, వాటన్నింటినీ ఉపయోగించుకుని సత్ప్రవర్తనతో బయటికి వచ్చి సమాజానికి ఉపయోగపడాలన్నారు. సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను ముఖ్యమైన రోజులలో జైలు నుండి విడుదల చేయటం జరుగుతున్నదని, అలాగే అండర్ ట్రయల్ మీటింగ్ ల సమయంలో వారి సత్ప్రవర్తన ఆధారంగా బెయిల్ ఇవ్వడం, లేదా శిక్ష తగ్గించడం వంటివి చేయడం జరుగుతున్నదని పేర్కొన్నారు. కాంపౌండబుల్ కేసుల్లో సైతం ఈ అవకాశం ఉన్నట్లు తెలిపారు. సత్యం, అహింస, శాంతి మార్గాలను ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ.. తప్పులు అందరూ చేస్తారని చేసిన తప్పును పశ్చాత్తాపంతో ఆ తప్పును సరిదిద్దుకొని, తిరిగి చేయకుండా ఉండాలన్నారు. జీవితం ఒకటే ఉంటుందని, ఎంతమందికి మంచి చేశామన్నదే ముఖ్యమని, జైలు జీవితం తర్వాత సమాజానికి, కుటుంబానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఖైదీలు బయటికి రావాలని కోరారు. ఖైదీల సంక్షేమం కోసం జిల్లా యంత్రాంగం జిల్లా జడ్జి ఆధ్వర్యంలో నియమ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని, ఎలాంటి లోటు రానివ్వమని తెలిపారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ, గాంధీ సిద్ధాంతాలను అందరూ అనుసరిస్తే ఎలాంటి సమస్యలు ఉండవని, ముఖ్యంగా సత్యాగ్రహం ఆహింస, సాధారణ జీవితం గడపడం, సొంతంగా తన కాళ్లపై తాను బ్రతికేందుకు ప్రయత్నించడం, సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ దీప్తి మాట్లాడుతూ గాంధీజి చెప్పిన విధంగా లక్ష్యం చేరుకునేందుకు మంచి దారిని ఎంచుకోవాలని, అటువైపుగా అడుగుచేయాలని అన్నారు. గాంధీ సిద్ధాంతాలను ప్రతి ఒక్కరు పునరంకితం చేసుకోవాలని కోరారు. 12 వ బటాలియన్ కమాండర్ సత్య శ్రీనివాసరావు మాట్లాడుతూ సమస్యలు వచ్చినప్పుడు ఓపికతో ఉండి సరైన మార్గంలో వెళ్తే ఎలాంటి తప్పులు జరగవని అన్నారు. జిల్లా జైలు సూపరింటిండెంట్ ప్రమోద్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించి స్వాగతం పలికారు. జిల్లా జైలర్ బాలకృష్ణ , ఇన్చార్జి ఆర్డీవో శ్రీదేవి, తహసిల్దార్ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

## మృతురాలి కుటుంబానికి మేఘారెడ్డి అభయ హస్తం



పెబ్బేరు, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): పెబ్బేరు మండలం రంగాపురం గ్రామంలో సంధ్యపోగు ఈశ్వరమ్మ భర్త ఎర్రన్న చనిపోవడం జరిగింది. ఈ విషయాన్ని గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు బి.రాంచంద్రారెడ్డి దృష్టికి తీసుకుపోగా,ఆయన వెంటనే స్పందించి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి దృష్టికి తీసుకుపోగా వారు మానవతా దృక్పథంతో స్పందించి వారి కుటుంబానికి అభయ హస్తం ద్వారా 5000 రూపాయల ఆర్థిక సాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ అద్యక్షుడు కావలి చిన్నోడు, నాజా జిల్లా అధ్యక్షులు మందడి చిరంజీవి, నందీశ్వర్, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దారపోగు వెంకటేష్,ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు బేరికి లక్ష్మణ్, బాపన్ పల్లి రమేష్, గ్రామ ఉపాధ్యక్షులు దాది రాముడు, పిట్ట నాగేంద్ర,ఆటో బాలస్వామి,పిట్ట రాముడు, మిద్దె శేఖర్, పాల్గొన్నారు

## ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



### ఆత్మకూరు సర్కిల్ కార్యాలయంలో

ఆత్మకూర్, అక్టోబర్ 02 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో జాతిపిత మహాత్మా గాంధీ జయంతి పురస్కరించుకొని ఆత్మకూరు సర్కిల్ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా గాంధీజీ చిత్రపటానికి ఆత్మకూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శివకుమార్,సబ్ ఇన్స్పెక్టర్ నరేందర్ లు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన దేశాన్ని స్వతంత్రం వైపు నడిపించి స్ఫూర్తిదాయకంగా నిలిచి స్వతంత్ర పోరాటంలో కీలక పాత్ర పోషించిన మహాత్ముడి సేవలను వారు కొనియాడారు. ఇట్టి కార్యక్రమంలో ఏఎస్ఐ లు బీచుపల్లి, రోశయ్య, హెడ్ కానిస్టేబుల్ మునీశ్వర్ రెడ్డి, కానిస్టేబుల్ బాలు, సురేందర్, జెపి గౌడ్, భీమయ్య, అశోక్, క్రాంతి, ఫయాజ్, రామకృష్ణ, రాణి, స్వర్ణలత లు పాల్గొన్నారు.

## ప్రాణాలు తీసిన డెంగ్యూ..

అదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను డెంగ్యూ జ్వరం వణికిస్తోంది. డెంగ్యూ బారిన పడి ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. డెంగ్యూ జ్వరంతో మహిళ మృతి చెందిన ఘటన సోమవారం లోకేశ్వరం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని భాగపూర్ గ్రామానికి చెందిన బైరి శ్రీలత ఐదు రోజులుగా డెంగ్యూ జ్వరంతో బాధపడుతూ హైదరాబాద్ లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. మహిళ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అటు, కుబీర్ మండలంలోని వర్ని గ్రామానికి చెందిన కొండిరాం అనే వ్యక్తి గత కొన్ని రోజులుగా తీవ్రమైన జరంతో బాధ పడుతున్నాడు. పరీక్షలు నిర్వహించగా డెంగ్యూ అని తేలింది. మెరుగైన చికిత్స కోసం బైంసాకు బయల్దేరాడు. ఈ క్రమంలోనే అలసి పోయి ఓ చోట చెట్టుకింద కూర్చున్నాడు. అక్కడికక్కడే మృతి చెందాడు. ఇదిలా ఉంటే, పల్లెల్లో పరిశుభ్రతపై తక్షణ చర్యలు చేపట్టారు అధికారులు. వీధులు, మురికి కాల్వ నిర్వహణ, రోడ్లపై బ్లీచింగ్ పౌడర్ చల్లటంపై దృష్టి సారించారు. ప్రజలకు కూడ పలు సూచనలు చేశారు. వర్షాకాలంలో ఇంట్లో ఎక్కడా నీరు పేరుకుపోకుండా చూసుకోవాలి. ఇది డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులను వ్యాప్తి చేసే దోమల నుండి మిమ్మల్ని కాపాడుతుందని చెప్పారు. అలాగే, ఆహారం విషయంలో కూడా జాగ్రత్తగా ఉండాలన్నారు. సులభంగా జీర్ణమయ్యే ఆరోగ్యకరమైన, తేలికపాటి భోజనం తీసుకోవాలని సూచించారు. వీలైనంత వరకూ కాచి, చల్లార్చిన నీటినే తరచూ తాగుతూ ఉండాలని చెప్పారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని చెప్పారు.

## గాంధీజీ, శాస్త్రిలకు నివాళులర్పించిన మేయర్

కంటేశ్వర్ : నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్ ఆధ్వర్యంలో బుధవారం మహాత్మా గాంధీ జయంతి, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా గాంధీ చౌక్ లోని గాంధీ విగ్రహానికి, పూల మాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ మాట్లాడుతూ.. నేటి యువత మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి అడుగుజాడల్లో నడవాలని భవిష్యత్తులో వారిని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం గాంధీ చౌక్ లో గాంధీ విగ్రహం వద్ద గాంధీ వేషంలో ఉన్నటువంటి చిన్నారులను చూసి ఆనందం వ్యక్తపరిచారు.

# ఎంఎస్ఎంఈలో బీసీలకు సబ్సిడీలు వర్తింపచేయాలి

**– మంత్రి పొన్నం ప్రభాకర్**



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఎంఎస్ఎంఈ %-% 2024 లో ఇతర వర్గాలకు ఇచ్చిన మాదిరిగానే బీసీలకు కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డికి బీసీ సంక్షేమ శాఖ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఎంఎస్ఎంఈ విధానంలో మార్పులు తీసుకొచ్చి బీసీల అంశాలను చేర్చేందుకు సానుకూలంగా స్పందించారు. దీంతో మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావుతో కలిసి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మేధావులు , రిటైర్డ్ ఐఎఎస్‌లు ,బీసీ ఎమ్మెల్యేలు , కార్పొరేషన్ చైర్మెన్లు , పారిశ్రామిక వేత్తలతో సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఎస్ఎంఈ జాతీయ రిటైర్డు డైరెక్టర్ ఆఫ్ జనరల్ చుక్కా కొండయ్యతో పాటు రిటైర్డు ఐఏఎస్ లు , మేధావులు ,పారిశ్రామికవేత్తలతో కలిపి కమిటీ వేయాలని నిర్ణయించారు. ఎంఎస్ఎంఈలో బీసీలకు సంబంధించిన అంశాలను చేర్చేందుకు వారి సలహాలు సూచనలు తీసుకొని అందులో చేర్చాల్సిన అంశాలపై కమిటీ నిర్ణయం తీసుకోనుంది. ప్రభుత్వం తీసుకొచ్చిన ఎంఎస్ఎంఈ పాలసీ దేశంలోనే బెస్ట్ విధానంగా అభివర్ణించారు. ఇందులో ఇతర వర్గాలకు ఇచ్చిన మాదిరి బీసీలకు కల్పిస్తే వారిలో పారిశ్రామిక అభివృద్ధి సాధించవచ్చని తెలిపారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ ఎంఎస్ఎంఈలో బీసీలకు సంబంధించిన ఎలాంటి అంశాలు చేర్చలేదని సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమలు బీసీ కులాలకు సంబంధించిన కుల వృత్తులే అధికంగా ఉంటాయనీ,ఈ విధానంలో బీసీలకు సబ్సిడీలు ఇతర అంశాలు చేరిస్తే లక్షలాది కుటుంబాలు ఈ పాలసీ ద్వారా ఉపాధి అవకాశాలు దొరకటంతో పాటు స్వతహాగా కుల వృత్తులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆర్థిక వృద్ధి సాధించటానికి ఉపయోగపడుతుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి బీసీ కుటుంబం ఒక సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమ అని బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం తెలిపారు. గోల్డ్ స్మిత్ ,రజక ,నాయి బ్రాహ్మణ ,తదితర చేతి వృత్తుల వారికి బీసీల అంశాలు చేరిస్తే ఎంఎస్ఎంఈ లో ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. జాతీయ ఎంఎస్ఎంఈలో ఎస్సీ, ఎస్టీలకు ఇస్తున్న సబ్సిడీల్లో బీసీ ,మైనారిటీ డిజేబుల్ వాళ్ళకి కూడా ఇవ్వాలని రిటైర్డు ఐఎఎస్ చిరంజీవులు సూచించారు. ఎంఎస్ఎంఈలో బీసీలకు ప్రత్యేక విధానం ఉండాలనీ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు రాష్ట్రంలో బీసీలకు అందించవచ్చని సూచించారు. సమావేశంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్ , వీర్లపల్లి శంకర్ బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ట్రోలింగ్ పై సర్కార్ సీరియస్

హైదరాబాద్: ఇటీవల సోషల్ మీడియాలో ప్రత్యక్షమవుతున్న వార్తలకు చెక్ పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. అభ్యంతరమైన భాషతో కొందరు నేతలను టార్గెట్ చేసి వ్యక్తిగత విమర్శలు చేస్తున్న వీడియోలు ప్రత్యక్షమవుతున్నాయి. కొన్ని యూట్యూబ్ ఛానల్స్ కాంగ్రెస్ నేతలను టార్గెట్‌గా చేసుకొని పెడుతున్న వీడియోలను వైరల్ చేస్తుండటంతో కాంగ్రెస్ ప్రభుత్వం వీటిని సీరియస్‌గా తీసుకుంది. అదే పనిగా కాంగ్రెస్ ప్రభుత్వం పై బురద జల్లే ప్రయత్నం చేస్తున్న యూట్యూబ్ ఛానెల్స్‌పై కఠినంగా వ్యవహరించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.వాస్తవ పరిస్థితులకు భిన్నంగా అసత్య ప్రచారాలు చేస్తూ పలు అంశాలకు కాంగ్రెస్ పార్టీని కార్నర్ చేసి కొన్ని యూట్యూబ్ ఛానల్ అదేపనిగా వీడియోలు తీస్తున్నారు. వీటితోపాటు తమకు అనుకూలమైన ప్రాంతాలకు వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తప్పించడమే ధ్యేయంగా పెట్టుకొని, నోటికి వచ్చినట్లు కాంగ్రెస్ నాయకులను తిట్టిస్తున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఈ క్రమంలో అలాంటి యూట్యూబ్ ఛానల్స్‌పై మరింత కఠినంగా వ్యవహరించేందుకు కాంగ్రెస్ సర్కార్ రెడీ అయ్యింది. అలాంటి వీడియోలు పోస్ట్ చేస్తున్న వారిపై సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది.గత కొద్ది రోజులుగా హైడ్రా పై తీవ్రస్థాయిలో ఫేక్ వీడియోలు సర్క్యులేట్ అవుతున్నాయి. ఎక్కడ కూల్చివేతలు జరిగినా వాటిని హైడ్రాకు అంటగట్టిస్తున్నారు. కొన్నిచోట్ల హైడ్రాకు ఎలాంటి సంబంధం లేనప్పటికీ అక్కడ కూలుస్తున్న రెవెన్యూ అధికారులను వదిలేసి వాటికి హైడ్రాకు ముడి పెడుతున్నారు. ఫలితంగా ఆక్రమణల తొలగింపు, మూసి ప్రక్షాళన కార్యక్రమాలపై హైడ్రా పై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి. కొన్ని యూట్యూబ్ ఛానళ్లు మరింత దిగజారి బాధితులు మాట్లాడిన దుర్భాషను ఎలాంటి ఎడిటింగ్ లేకుండా యూట్యూబ్ లలో అప్లోడ్ చేస్తూ వైరల్ చేసి ట్రెండింగ్ లో ఉండేలా చూస్తున్నారు.కొన్ని సందర్భాల్లో ప్రత్యేకించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు మహిళా మంత్రులను టార్గెట్‌గా, వారిపై ఘోరమైన విమర్శలు చేస్తూ సోషల్ మీడియాలలో వీడియోలు అప్లోడ్ చేస్తున్నారు. ఒక సీఎం హోదాలో ఉన్న వ్యక్తిపై అదే పనిగా తిట్టించడం, పైగా ఆ వీడియోను ఎలాంటి ఎడిటింగ్ చేయకుండా అలానే సోషల్ మీడియాలో పెడుతూ ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుంది. ఎక్కడో ఇతర రాష్ట్రాల్లో జరిగిన ఘటనలు కూడా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆపాదిస్తూ సంబంధం లేని అంశాలకు రేవంత్ సర్కార్‌ను బదనాం చేసే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఇటీవల చోటు చేసుకున్న ఇలాంటి పలు సంఘటనలు ఉదాహరిస్తూ ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ నేతలు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదులు చేశారు.యూట్యూబ్ ఛానల్ పేరుతో సమస్యలను చూపించడంలో తప్పులేదు.. కానీ, అదే పనిగా ఒక ప్రాంతానికి వెళ్లి సంబంధం లేని విషయాలను ప్రభుత్వానికి ఆపాధించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తిట్టడమే లక్ష్యంగా పెట్టుకొని బాధితులతో ప్రభుత్వాన్ని బూతులు తిట్టిస్తున్నారు. మహిళా మంత్రులు అని కూడా చూడకుండా కొంతమందితో అనుచిత వ్యాఖ్యలు చేయిస్తున్నారు. కొన్ని యూట్యూబ్ ఛానెల్స్ పై ఇప్పటికే కాంగ్రెస్ నాయకులు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీడియోలకు సంబంధించిన లింకులు జతపరుస్తూ ఆయా పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేయగా, పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇప్పటికే కొందరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్న పోలీసులు మరికొంతమంది కోసం గాలిస్తున్నారు.ఇక తాజాగా మంత్రి కొండా సురేఖ పై ఇష్టానుసారంగా సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేసిన వ్యక్తులను ఇప్పటికే సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించినట్లు సమాచారం. సోషల్ మీడియాలో ట్రోలింగ్ లను చూసి మంత్రి కొండా సురేఖ గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ కంటతడి పెట్టుకున్నారు. ఇలాంటి సోషల్ మీడియా ప్రజలకు ఏమాత్రం అవసరం లేదని, ప్రజలకు మంచి చేయడానికి వాటిని ఉపయోగించాలి తప్ప, అడ్డదారుల్లో ట్రోలింగ్ చేసి, లేని ఘటనను ప్రభుత్వానికి ఆపాదించడం మానుకోవాలని అటు ప్రభుత్వం, ఇటు పోలీసులు సోషల్ మీడియా ట్రోలర్స్‌కి, యూట్యూబ్ ఛానల్స్ కు కఠిన హెచ్చరికలు జారీ చేస్తున్నారు

# ఆర్టీసీలో 3 వేల ఉద్యోగాలు

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని ఆర్టీసీలో త్వరలో 3 వేల ఉద్యోగాలకు ప్రకటన వెలువరించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తాజాగా కరీంనగర్‌లో 33 విద్యుత్ బస్సులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈ మేరకు వెల్లడించారు. ఆయన ఇంకా ఈ విధంగా మాట్లాడారు. ఇప్పటివరకు ఎంతో మంది మహిళలు మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణం చేశారని తెలిపారు. మహిళా శక్తి, మెప్మా ద్వారా మరిన్ఇన ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేస్తామన్నారు.ఆర్టీసీ ఉద్యోగులకు పీఆర్సీ, కారుణ్య నియామకాలపై దృష్టి పెడతామని చెప్పారు. విద్యుత్ బస్సుల కొనుగోలుకు జేబీఎం సంస్థతో ఆర్టీసీ ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ సహా ఇతర జిల్లాల్లోనూ విద్యుత్ బస్సు సర్వీసులను నడపాలన్నదే తమ ప్రభుత్వం ప్రధాన ఉద్దేశ్యం అని అన్నారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు హైదరాబాద్ రింగ్ రోడ్డు లోపల డీజిల్‌తో నడిచే బస్సు ఒక్కటి కూడా ఉండకుండా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజాపాలన ఏర్పడిన తర్వాత విప్లవాత్మక మార్పులు చేస్తూ ఆర్టీసీని దినదినాభివృద్ధి చేస్తున్నామని పొన్నం ప్రభాకర్ తెలిపారు.ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా సొసైటీ ఆధ్వర్యంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 604 టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆయా జిల్లాల్లో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన, బోధనేతర పోస్టులను పొరుగు సేవల ద్వారా భర్తీ చేయడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్పీడీ శ్రీనివాసరావు తెలిపారు.

ఆన్‌లైన్ దరఖాస్తులకు అక్టోబరు 10 చివరి గడువు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో చెక్ చేసుకోవచ్చు. ఇంగ్లిష్, సివిక్స్, కామర్స్, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, ఒకేషనల్ సబ్జెక్టులో టీజీటీ ఖాళీలు, తెలుగు, హిందీ, ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టుల్లో సీఆర్టీ ఖాళీలు ఉన్నాయి.

# నిర్వాసితులను ఒప్పించిన తర్వాతే కూల్చివేతలు

**– మూసీ బాధితులకు న్యాయం చేస్తాం**

**– నది సుందరీకరణ నిర్ణయం బీఆర్ఎస్ సర్కార్‌దే : ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి శ్రీధర్‌బాబు**



హైదరాబాద్: మూసీ నిర్వాసితులకు న్యాయం చేసిన తర్వాతే, వారిని అక్కడి నుంచి తరలిస్తామని ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలను ఇబ్బంది పెట్టదని స్పష్టం చేశారు. నిర్వాసితులకు డబుల్‌బెడ్ రూం ఇండ్లు, ఉపాధి, వారి పిల్లలకు రెసిడెన్షియల్ స్కూళ్లల్లో చదువుకునే ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 2017లో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ చేసిన పనులను ఆ పార్టీ నేతలు మర్చిపోయినట్లున్నారని ఎద్దేవా చేశారు. ”2018లో మూసీకి సంబంధించిన ప్రాజెక్టును ఏవిధంగా చేపట్టాలనే దానిపై సమావేశం నిర్వహించారు. 15 మే 2019లో నిపుణుల కమిటీ ప్రక్షాళనపై నివేదికను తయారు చేసింది. 55 కిలోమీటర్ల మూసీ రివర్ ఇరు వైపులా సర్వే చేశారు. మూడు జిల్లాలు, 47 గ్రామాల పరిధిలో జరిగిన సర్వేలో నది సరిహద్దు, మండలాల మ్యాప్‌లను నిర్ధారించారు. ఆ క్రమంలోనే మూసీకి ఇరు వైపులా 50 మీటర్లను బఫర్ జోన్‌గా గుర్తించాలని జీవో 7ను జారీ చేశారు. ఆ ప్రాతిపదికన 8,480 అక్రమ నిర్మాణాలను ఆనాటి వరకు అధికారులు గుర్తించారు. యుద్ధప్రాతిపదికన వాటిని తొలగించాలని నాటి సమావేశాల్లోనే నిర్ణయించారు. మూసీ నిర్వాసితులకు పరిహారం చెల్లించి మాస్టర్ ప్లాన్ పూర్తి చేయాలని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లను అప్పటి మున్సిపల్ శాఖా మంత్రి కేటీఆర్ ఆదేశించారు. ప్రజలకు పరిశుభ్రమైన గాలి, నీరు అందించాలనే ఆలోచన చేశారని మేం కూడా అనుకున్నాం. కానీ పేపర్లకే పరిమితమై మాటలతోనే కాలం గడిపారు. మూసీ ప్రక్షాళన ప్రక్రియ చాలా క్లిష్టమైనది. సమస్యలను బీఆర్ఎస్ నేతలు ఇంకా జఠిలం చేస్తున్నారు. అందరికీ ఉపయోగపడే పనులపై వారు రాద్ధాంతం చేస్తున్నారు'' అని శ్రీధర్‌బాబు విమర్శలు గుప్పించారు. నిర్వాసితులందరితో చర్చించి ముందుకెళ్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మల్లన్నసాగర్ భూ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ఇవ్వకుండానే బలవంతంగా వెళ్లగొట్టారని మండి పడ్డారు. తాము మాత్రం మూసీ బాధితులకు మరో చోట ఆవాసం కల్పించిన తర్వాతే ఇండ్లను తొలగిస్తామని స్పష్టం చేశారు. మూసీ డీపీఆర్ సిద్ధం కాకుండానే ప్రాజెక్ట్ వ్యవయంపై బీఆర్ఎస్ ఆరోపణలు చేస్తున్నదని విమర్శించారు. రాజకీయాలు మాని అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

# చిన్నారిని చిదిమేసిన స్కూల్ బస్సు

కరీంనగర్: బతుకమ్మ పండగ పూట ఆ ఇంట విషాదం నిండింది. సంబరాలకోసం ముస్తాబైన చిన్నారి అంతలోనే బస్ ప్రమాదంలో మృత్యువాతపడింది. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలోనీ మహర్షి ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో విషాద సంఘటన చోటు చేసుకుంది. నామపూర్ గ్రామానికి చెందిన సల్కం భూమయ్య-వెంకటవ్వ కూతురు మనోజ్ఞ విద్యార్థిని మహర్షి పాఠశాల లో నర్సరీ చదువుతుంది. ఆ చిన్నారి ప్రతి రోజూలాగే ఉత్సాహంగా స్కూలుకు బయలుదేరింది. ఉదయం పూట నామాపూర్ గ్రామంలో బస్ ఎక్కిన మనోజ్ఞ అక్కడి నుండి స్కూల్ చేరుకుంది. అయితే స్కూల్ లో బతుకమ్మ సెలబ్రేషన్ ఉండడం తో అందుకు అనుగుణంగా రెడీ అయ్యి వచ్చింది.ఉదయం స్కూల్ బస్ దిగిన క్రమంలో చిన్నారి జడలో పెట్టుకున్న పువ్వు కింద పడడంతో ఆ పువ్వును తీసుకోవడానికి కిందికి వంగింది. అది గమనించని డ్రైవర్ వ్యాన్ ని ముందుకు తీస్తున్న సమయంలో విద్యార్థిని మను తల పై నుండి వ్యాన్ వెనుక టైర్లు వెళ్లడంతో తల నుజ్జు నుజ్జు అవ్వడం తో అక్కడికక్కడే మృతి చెందింది. అల్లారుముద్దుగా పెంచుకున్న పాప అప్పుడే తయారై వెళ్లిన తమ పాప చనిపోయిందని విషయం తెల్సిన తల్లి రోదనలు మిన్నంటడంతో అక్కడ పాఠశాలలో అందరిని కలచి వేసింది. విషయం తెలుసుకున్న బంధువులు పాఠశాలకు చేరుకొని ఆందోళనకు దిగారు. మాకు బస్ డ్రైవర్ ను అప్పగించాలని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వారిని అడ్డుకోవడంతో కాస్త ఉద్రిక్తత నెలకొంది.పరిస్థితి అదుపులోకి తీసుకోవడానికి పోలీసులు ప్రయత్నించినప్పటికీ ఆందోళన విరమించలేదు. పెద్ద ఎత్తున పోలీసు బలగాలు చేరుకొని డిఎస్పీ చంద్రశేఖర్ వారిని సముదాయించి మీకు న్యాయం చేశారని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించించారు.అప్పటికే చేరుకున్న విద్యార్థి సంఘాలు విద్యార్థినికి న్యాయం చేయాలని, వెంటనే స్కూల్ సీజ్ చేయాలని ఆందోళన చేశారు. పాఠశాల కరస్పాండెంట్ విదేశాల్లో ఉండటం వలన పాఠశాలను పట్టించుకోకపోవడం వల్లనే ఇంతటి దారుణం జరిగిందని బంధువులు, ఆరోపించారు. స్కూల్ యాజమాన్యంతో మాట్లాడిన కుటుంబ సభ్యులు నష్టపరిహారం చెల్లిస్తామని బస్ కు ఇన్సూరెన్స్ ఉందని చెప్పడం తో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు శాంతించారు.విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఇలాంటి స్కూల్ ని వెంటనే సీజ్ చేయాలని విద్యార్థి సంఘాలు పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. న్యాయం చేయాలని వారు డిమాండ్ చేయడంతో సంఘటన స్థలానికి చేరుకున్న జిల్లా విద్యాధికారి రమేష్ వెంటనే స్పందించి స్కూల్ సీజ్ చేసినట్లు తెలిపారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వ్యాన్ డ్రైవర్, క్లీనర్ పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# అదిలాబాద్ లో ఘోర రోడ్డు ప్రమాదం

అదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని మేకలగండి కార్నర్ సమీపంలో అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. డివైడర్‌ను కారు ఢీకొట్టి కొద్దిదూరం వెళ్లి బోల్తా పడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఐదురుగు ప్రాణాలు కోల్పోయారు. మరో నలుగురికి గాయాలయ్యాయి. నిర్మల్ జిల్లా భైంసా నుంచి ఎనిమిది మందితో ఆదిలాబాద్ వస్తున్న కారు ప్రమాదానికి గురైంది. అందులో ప్రయాణిస్తున్న వారిలో మొయిజ్ (60), అలీ(8), ఖాజా మొయినుద్దీన్ (40), మహమ్మద్ ఉస్మానుద్దీన్ (11) అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనలో గాయపడ్డ ఫరీద్ (12) రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. తీవ్రంగా గాయపడ్డ మిగతా వారినీ 108 అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. మృతులు, క్షతగాత్రులంతా ఆదిలాబాద్ పట్టణంలోని టీచర్స్ కాలనీ వాసులు. వీళ్లంతా ఒకే కుటుంబానికి చెందిన రక్త సంబందికులు. గాయపడ్డ వారికి రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. మృతదేహాలను పోలీసులు కేసు నమోదు చేసుకొని పంచనామా నిర్వహించి మార్చురీకి తరలించారు. ఈ మేకలగండి కార్నర్ సమీపంలో తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. గతేడాది సైతం ఓ కుటుంబం ఇలాగే ప్రమాదంలో చనిపోయారు. ఏడాదిపాటున ఇక్కడ పదుల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరుగుతూ అనేక మంది మృత్యువాత పడుతున్నారు. గుడిహత్నూర్ నుంచి సీతాగొంది వరకు గుట్ట ప్రాంతం డౌన్ లెవెల్‌లో ఉండడం వల్ల ఎక్కువగా చాలామంది న్యూట్రల్ లో వెళుతూ ఉంటారు. భారీ వాహనాలు అయితే న్యూట్రల్లో వెళుతూ కంట్రోల్ లేకుండా ఒక్కోసారి ఎదురుగా వచ్చిన వారిని ఢీకొంటూ వెళ్ళిపోతుంటాయి. ఇలాంటి ఘటనలు ఎన్నో జరిగాయి. మేకలగండి కార్నర్‌లో జరిగే ప్రమాదాల్లో జాతీయ రహదారి అధికారుల భద్రత వైఫల్యం.. రవాణా శాఖ అధికారుల లోపం కూడా ఉన్నట్లు ప్రయాణికులు వాపోతున్నారు. వీరిపై చర్య తీసుకునేలా రోడ్డు ప్రమాదాలు జరగకుండా చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

# హైడ్రాపై ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలి

**– చెరువులు, కుంటల ఆక్రమణలపై శ్వేతపత్రం ప్రకటించాలి**

**– జీవో 58,59 ప్రకారం పేదల ఇండ్లు క్రమబద్ధీకరించాలి**

**– నల్ల చట్టాలు తెచ్చిన బీజేపీ.. రైతుల పేరుతో దొంగ దీక్షలు : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**




హనుమకొండ: హైడ్రాపై ప్రజలు భయాందోళన లకు గురవుతున్నందున దాని పరిధి, పరిమితిపై రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరి స్పష్టం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు.హన్మకొండ జిల్లా బాల సముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైడ్రా మొదట ఎన్ కన్వెన్షన్ కూల్చివేసినప్పుడు ప్రజామోదం లభించిందని, కానీ పేదల ఇండ్లు కూల్చిన తర్వాత వారి హృదయ విధారక సన్నివేశాలు చూసిన తర్వాత అభిప్రాయం మారిందన్నారు. హైడ్రా మిస్ ఫైర్ అయినట్టు కనిపిస్తున్న దని, దాన్ని విధ్వంసానికి కాకుండా అభివృద్ధికి, వికాసానికి వినియోగించాలని సూచించారు. రాష్ట్రంలో చెరువులు, కుంటలు ఎన్ని ఉన్నాయో, ఎక్కడ ఆక్రమణలు జరిగాయో శ్వేత పత్రం ప్రకటించాలని కోరారు. కొందరు పెద్దలు వాటిని ఆక్రమించి విల్లాలు, ఫామ్ హౌస్‌లు, కన్వెన్షన్లు నిర్మిస్తే.. మరికొన్ని చోట్ల పేదలు అన్ని అనుమతులు తీసుకుని ఇండ్లు కట్టుకొని నివాసం ఉంటున్నారని చెప్పారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్.. మూసీ ఆక్రమణలు హైడ్రా పరిధిలోకి రావని చెప్పడం సంతోషమేనని, అలాగే హైకోర్టు పేదల ఇండ్ల కూల్చివేతలపై చేసిన వ్యాఖ్యలను కూడా ప్రభుత్వం పరి గణనలోకి తీసుకొని ప్రజల్లో ఉన్న భయాందోళనలను తొలగించాలని కోరారు. పేదల ఇండ్లను జీవో 58,59 ప్రకారం క్రమ బద్ధీకరించాలని డిమాండ్ చేశారు. హైడ్రాను హైదరాబాద్‌కే పరిమితం చేయాలని,జిల్లాలకు తేవొద్దని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా హైడ్రా సుడిగుండం నుంచి బయటపడి పాలనపై దృష్టి సారించి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. నల్ల చట్టాలు తెచ్చి రైతులపై ప్రయోగించిన బీజేపీ.. ఇప్పుడు రైతుల రుణమాఫీ చేయాలని దొంగ దీక్షలు చేయడం దయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, నేదునూరి జ్యోతి, ఆదరి శ్రీనివాస్, మంద సదాలక్ష్మి, ఎన్.అశోక్ స్టాలిన్, తోట బిక్షపతి, కర్రె లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంక్ లో భారీ స్కామ్

ఆత్మకూరు: అన్నదాతకు రుణాలు ఇచ్చి పూర్తి సహాయ సహకారాలు అందించవలసిన జిల్లా పరస్పర సహకార బ్యాంకులో దొంగలు పడ్డారు. ఆ దొంగలు ఎవరో కాదు సొంత ఇంటి దొంగలే. పై అధికారుల కళ్ళుగప్పి ఎలాంటి అనుమానం రాకుండా ఏకంగా 80 లక్షల రూపాయలను బ్యాంకు లాకర్ లో నుంచి రాజా మార్గంలో బయటకు తెచ్చి జేబులు నింపుకున్నారు ఇద్దరు కిందిస్థాయి అధికారులు. నెల రోజుల పాటు సాగిన ఈ దోపిడీకి తెరలేపింది ఆ బ్యాంకు లోని క్యాషియర్, ప్రాసింగ్ ఆఫీసర్లు. ఈ తతంగంపై బ్రాంచ్ మేనేజర్ కు అనుమానం రాకుండా ఈ ఇద్దరు జాగ్రత్త పడ్డారు. ఇంటి దొంగలను ఈశ్వరుడు కూడా పట్టలేడనే సామెతను ఈ ఇద్దరు దొంగలు రుజువు చేసి చూపించారు. అయితే నెలవారి నగదు లెక్కల లావాదేవీల పరిశీలనలో మొత్తం నగదులో తక్కువ తేలడంతో ఈ స్వాహా బాగోతం బయటకు పొక్కింది. దీంతో ఆ ఇద్దరు అధికారులను సస్పెండ్ చేస్తూ క్రిమినల్ కేసుకు సిఫార్సు చేశారు.నంద్యాల జిల్లా ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు మండలాల పరిధిలో రైతుల కోసం ఆత్మకూరులో జిల్లా సహకార బ్యాంకు ఏర్పాటు అయింది. ఈ బ్యాంకు పరిధిలో ఆత్మకూరు, నాగంపల్లి, వేంపెంట, వెలుగోడు ప్రాంతాల్లో ప్రాథమిక సహకార సంఘాలకు ఈ బ్యాంకు ద్వారా రుణాలు ఇస్తుంటారు. సుమారు 6 వేల మందికి పైగా బ్యాంకు ఖాతాదారులు ఉంటే వారి వ్యాపారాలకు ప్రతి సంవత్సరం 220 కోట్ల రూపాయల వరకు రుణాలు అందించారు.ఈ క్రమంలో ఆత్మకూరు కేడీసీసీ బ్యాంకు లో క్యాషియర్ గా పనిచేస్తున్న అల్తాఫ్ హుస్సేన్, అసిస్టెంట్ మేనేజర్ (పాసింగ్ ఆఫీసర్) రంగయ్య ఇద్దరు కుమ్మక్కై స్ట్రాంగ్ నుంచి నగదును రోజువారి లావాదేవీల కు బయటకు తెచ్చే క్రమంలో కొంత మొత్తాన్ని దాచేవారు .ఇలా నెల రోజులుగా వీరు దోచిన మొత్తం సుమారు 80 లక్షల రూపాయల నగదు. బ్రాంచ్ మేనేజర్ పులి రాజుకు కూడా అనుమానం రాకుండా ఈ ఇద్దరు వ్యక్తులు ఇంతటి భారీ దోపిడీకి తెగబడ్డారు నెల చివరి నిల చివరి తనిఖీ లో 80 లక్షల రూపాయలు కు లెక్కలు తేలలేదు. దీంతో జిల్లా చీఫ్ మేనేజర్ సౌజన్య కీర్తి రహస్యంగా విచారణ జరపడంతో ఇంటి దొంగతనం బయటపడింది. దీంతో రాత్రికి రాత్రే ఇద్దరు దొంగలను సస్పెండ్ చేశారు. ఆత్మకూరు పోలీస్ స్టేషన్లో క్రిమినల్ కేసు నమోదుకు చేయడానికి రంగం సిద్ధమైంది

# పరిసరాల పరిశుభ్రత అనేది నేరాలను తగ్గిస్తుంది

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నారాయణ బాబు**

**- న్యాయ అవగాహన ర్యాలీ**




జయశంకర్ భూపాలపల్లి, పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే మానసిక ఆరోగ్యం బాగుంటుందని, మానసిక ఆరోగ్యం బాగుంటే నేరం చేయాలనే ఆలోచన రాదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పి. నారాయణ బాబు అన్నారు. స్వచ్ఛత హై సేవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కోర్టు ప్రాంగణం వద్ద ప్రారంభం అయిన న్యాయ అవగాహన ర్యాలీ అంబేద్కర్ సెంటర్ నుండి తిరిగి జిల్లా ప్రధాన న్యాయస్థానం వరకు సాగింది. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది మరియు విద్యార్థులను ఉద్దేశించి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రసంగించారు. జడ్జి మాట్లాడుతూ... హై కోర్ట్ వారి ఆదేశాల మేరకు కోర్టు ప్రాంగణాల్లో స్వచ్ఛ్ హై సేవా కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. పరిశుభ్రత అనే సేవను అందరూ చేయాలనీ అప్పుడు దేశం మొత్తం శుభ్రంగా తయారవుతుందని అన్నారు. అను నిత్యం మనందరి కోసం శ్రమిస్తున్న పారిశుద్ధ కార్మికులను గౌరవించాలని జడ్జి గారు సూచించారు, పారిశుద్ధ కార్మికులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి గారు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి మరియు న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే. జయరాం రెడ్డి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్. రామచంద్రా రావు , అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కూనూరి సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి బల్ల మహేందర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏదులాపురం శ్రీనివాస్ , కోర్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రతీక బతుకమ్మ విశిష్ఠత తెలుసా..!!

హైదరాబాద్: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు నిలువెత్తు ప్రతీక బతుకమ్మ ఆడబిడ్డలంతా సంబురంగా జరుపుకొనే ఘనమైన వేడుక ఇది. ప్రకృతిని ఆరాధిస్తూ సాగే పూల పండుగ బతుకమ్మ.

ఒక్క మాటలో చెప్పాలంటే ప్రపంచంలో మరెక్కడా కనిపించని, తెలంగాణకు మాత్రమే సొంతమైన వినూత్నమైన, అరుదైన పూలవేడుక బతుకమ్మ. పూలతో దేవుడిని కొలవడం కాదు.. పూలనే దేవుడిలా కొలిచే వేడుక ఇది. బతుకమ్మ అంటే బతుకుదెరువును మెరుగుపరిచే అమ్మ అని అర్థం. తొమ్మిది రోజులు తెలంగాణ అంతటా ఒక జాతరలా సాగి చివరిరోజు సద్దుల బతుకమ్మగా మన వాకిట్లో బతుకుదెరువును ఆవిష్కరిస్తుంది. ఆటపాటలతో మనల్ని సేదతీరుస్తుంది. జీవన సంబురాన్ని ఆవిష్కరిస్తుంది. ప్రపంచంలో మరెక్కడా లేనివిధంగా తెలంగాణలో మాత్రమే జరుపుకొనే పండుగ బతుకమ్మ. స్వరాష్ట్రంలో రాష్ట్ర పండుగగా గుర్తింపు పొంది నేడు ప్రపంచంలో తెలంగాణవారున్న చోటల్లా పూలజాతరై వర్ధిల్లుతోంది. ఆడబిడ్డలంతా ఒక్కచోట చేరి వాడవాడలా నిర్వహించే ఉత్సవమే బతుకమ్మ. ప్రకృతిలో లభించే ప్రతి పువ్వునూ. బతుకమ్మ వేడుకను ఆశ్వయుజ మాస శుద్ధ పాడ్యమి నుంచి తొమ్మిది రోజులు ఎంతో వైభవంగా జరుపుకుంటారు. భాద్రపద అమావాస్య లేదా పెత్రమాస రోజు నుంచి అశ్వయుజ అష్టమి వరకు తొమ్మిది రోజులు ఈ సంబురం కొనసాగుతుంది. ఆడబిడ్డలంతా చివరి రోజు అశ్వయుజ అష్టమి నాడు ఉపవాసం పాటిస్తూ, స్నానాధికాలు ముగించుకుని, ముందుగా చిన్న బతుకమ్మను పేరుస్తారు. గౌరమ్మను నిలుపుకొంటారు. అంతేకాకుండా సద్దులు సమర్పిస్తారు. ప్రకృతిలో లభించే ప్రతి పువ్వునూ ఏరికోరి తెచ్చి, బతుకమ్మలను పేరుస్తారు. అంతేకాకుండా బతుకమ్మ వేడుకలో ఉపయోగించే పూవుల్లో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. పూల నుంచి వచ్చే పరిమళాలు, వాటి లేలేత స్పర్శ ఆరోగ్యాన్ని పెంచుతాయన్నది నిపుణుల మాట. రంగు రంగుల పూలను త్రికోణాకారంలో పేర్చి అలంకరించిన గౌరమ్మల చుట్టూ చప్పట్లు చరుస్తూ వలయంగా తిరుగుతూ ఆడే వేడుక బతుకమ్మ.. జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్టేట్ సెక్రటరీ వడ్డేపల్లి హనుమంతు తెలిపారు.

# సీజనల్ వ్యాధులు తగ్గుముఖం

**- వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజరు కుమార్**

**- తగ్గిన డెంగ్యూ ప్రభావం : డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ వెంకట్**

**- ఉస్మానియా ఆస్పత్రి సందర్శన**



ధూల్ పేట్: సీజనల్ వ్యాధులు తగ్గుముఖం పట్టాయని వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజరుకుమార్ అన్నారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిని డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ వెంకట్‌తో కలిసి మంగళవారం ఆయన సందర్శించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ, అర్ఎంఒ-1 డాక్టర్ జయకృష్ణ, వీవీపీ ఈఈ శ్రీనివాస్‌తో కలిసి ఉదయం ఓపీలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఐపీ అడ్మిట్ అయిన రోగుల సౌకర్యాలు, ఫార్మసీ, వైద్య పరీక్షలు, బ్లడ్ బ్యాంక్, రోగులకందిస్తున్న డైట్(ఫుడ్) సరఫరాను పరిశీలించారు. వైద్య సేవలపై రోగులనడిగి తెలుసుకున్నారు. సెక్యూరిటీ, శానిటేషన్ పనితీరును పర్యవేక్షించారు. అనంతరం సూపరింటెండెంట్ చాంబర్‌లో మీడియాతో కమిషనర్ మాట్లాడారు. సీజనల్ వ్యాధులతో వస్తున్న రోగుల్లో 10 నుంచి 15 శాతం మంది అడ్మిట్ అవుతున్నారని తెలిపారు. డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా కేసులు తక్కువగా నమోదయ్యాయని, వాటి ప్రభావం ఎక్కువ లేదని అన్నారు. ఉదయం నుంచి ఆస్పత్రి అన్ని విభాగాలనూ పరిలించామని, మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగులకు వైద్య సేవలు, ఐసోలేషన్ సౌకర్యం, అనుభవజ్ఞులైన వైద్యులు ఉన్నారన్నారు. బ్లడ్ బ్యాంక్ సేవలు, పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. కరెంట్, వాటర్ సర్వీసెస్, మెడికల్ సర్వీసెస్ మెరుగ్గా ఉన్నాయని చెప్పారు.

డీఎంఅండ్‌హెచ్ఓ మాట్లాడుతూ.. గతంతో పోల్చుకుంటే డెంగ్యూ కేసులు చాలా తగ్గాయన్నారు. నగరంలో ఎక్కువగా మూసీ పరిసర ప్రాంతాల్లో ప్రభావం ఉండేదని, కానీ ప్రస్తుతం అర్బన్ ప్రాంతాలు సికింద్రాబాద్, అంబర్‌పేట, చాంద్రాయణగుట్ట వంటి ప్రాంతాల్లో డెంగ్యూ కేసులు పెరిగాయన్నారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా జీహెచ్ఎంసీ ఎంటమాలజి అధికారులు ప్రభావిత ప్రాంతాల్లో దోమల ఫాగింగ్, యాంటీ లార్వా నివారణకు చర్యలు తీసుకున్నారన్నారు. నగరంలో జనవరి నుంచి సెప్టెంబర్ వరకు 2022లో 1025, 2023లో 920, 2024లో 496 డెంగ్యూ కేసులు నమోదయ్యాయని తెలిపారు. బస్తీ దవాఖాన, పీహెచ్‌సీలలో ల్యాబ్ సౌకర్యం, మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. రోగి వైద్య పరీక్షల రిపోర్టు నేరుగా వారి సెల్‌ఫోన్‌కు వస్తుందన్నారు. ఈ సారి చికెన్ గున్యా కేసులు నమోదయ్యాయని.. అయినా అంత ప్రభావం లేదన్నారు. తగిన సమయంలో చికిత్స తీసుకోవడంతో చాలావరకు మెరుగైందన్నారు. నగరంలో ప్రయివేటు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో 443 కేసులు నమోదయ్యాయని తెలిపారు.

# సోషల్ మీడియా పై కాంగ్రెస్ గుర్రు...

హైదరాబాద్: తెలంగాణలో హడ్రా కూల్చివేతలు విపక్షాలకు ఒక ఊతంలాగా దొరికాయి. పూర్తిగా నైరాశ్యంలో ఉన్న విపక్ష పార్టీలకు హైడ్రా కూల్చివేతలు కలసి వచ్చాయనే ప్రచారం సోషల్ మీడియాలో నడుస్తుంది. నిజానికి నగరానికి చెందిన ఎమ్మెల్యేలు కూడా హైడ్రా కూల్చివేతలపై కొంత విముఖత చూపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కానీ ఒక మంచి పనిచేసినప్పుడు ఇలాంటి విమర్శలు, ఆరోపణలు సహజమే.

ఎందుకంటే ఒక సదుద్దేశ్యంతో చేసే పనికి ఆటంకాలు కూడా అదే మాదిరిగా వస్తుంటాయి. మెయిన్ స్ట్రీమ్ మీడియాతో పాటు సోషల్ మీడియాలో కూడా రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా కథనాలు వస్తున్నాయి. హైదరాబాద్ నగరంలో గత ఎన్నికల్లో కాంగ్రెస్ కు ఒక్క ఎమ్మెల్యే కూడా గెలవలేదు. అందుకే కక్ష సాధింపు చర్యతో ప్రజలను ఇబ్బంది పెట్టేందుకు కూల్చివేతలకు శ్రీకారం చుట్టిందని సోషల్ మీడియాలో అనేక పోస్టులు కనిపిస్తున్నాయి. నిజానికి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలు జరగాల్సి ఉంది. నిజంగా రాజకీయ కోణంలో ఆలోచించే వారయితే రేవంత్ ఆ పనిచేయరన్నది కూడా అంతే వాస్తవం. ఎందుకంటే ఎక్కువ మంది ప్రజలు తమ ఇళ్లను కూలిస్తే కాంగ్రెస్ కు వ్యతిరేకంగా ఓటు వేసే అవకాశముందని ఆయనకు తెలియంది కాదు. కానీ రేవంత్ రెడ్డి మాత్రం అవేమీ పట్టించుకోకుండా మూసీనది ప్రక్షాళనతో పాటు సుందరీకరణకు ఆయన నడుంబిగించారు. చెరువులను, నాలాలను, కుంటలను ఆక్రమిస్తే నష్టపోయేది ఎవరు? ప్రజలు కాదా? వరదలు వచ్చినప్పుడు సంపాదించుకున్న, కూడబెట్టుకున్న కొద్దిపాటి వస్తువులు కూడా వరదల ధాటికి కోల్పోవాల్సి వస్తుందన్నది అనేక సార్లు రుజువయింది. ప్రజలు ఇబ్బంది పడకూడదనే, భవిష్యత్ లో కోట్లాది మంది హైదరాబాదీలను రక్షించడానికే ఇలాంటి ఆక్రమణలను తొలగిస్తున్నామని చెబుతున్నప్పటికీ ఆక్రమణదారుల చెవుల కెక్కడం లేదు. దీనికి తోడు కూల్చివేతలు రాజకీయంగా రగులుకుంటుండటంతో ప్రభుత్వం కూడా ఏం చేయాలో అర్థం కాని స్థితిలో ఉంది. నిజానికి రాజకీయ పార్టీలు, హైదరాబాద్ బాగు కోరుకునే వారు ఎవరైనా ఈ ప్రతిపాదనలను అంగీకరించాలి. కానీ అలా చేయడం లేదు. ఇక ఇప్పటి వరకూ హైదరాబాద్ నగరానికి చెందిన ఎమ్మెల్యేలు కూడా కూల్చివేతల దెబ్బకు బీఆర్ఎస్ నుంచి వచ్చేందుకు ఇష్టపడటం లేదన్న వార్తలు కూడా కాంగ్రెస్ నేతలను కొంత వణికిస్తున్నాయి. మొన్నటి వరకూ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీకి క్యూ కట్టిన ఎమ్మెల్యేలు ఇప్పుడు పునరాలోచనలో పడినట్లు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తుండటంతో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ లు రియాక్ట్ అయ్యారు. తప్పుడు ప్రచారం చేస్తున్న సోషల్ మీడియాపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆక్రమణదారుల ఇళ్ల కూల్చివేతతో ప్రభుత్వం ఊరుకోవడం లేదని, వారికి డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయిస్తున్నామని, గతంలో బీఆర్ఎస్ గౌరవెల్లి, మల్లన్న సాగ్ ప్రాజెక్టు బాధితులపై లాఠీ ఛార్జి చేసినట్లు తాము బాధితులపై జరపడం లేదన్నారు. ప్రజలను బీఆర్ఎస్ నేతలు రెచ్చగొడుతున్నారని, ఇటువంటి పనులను మానుకోవాలని హితవు పలికారు.

# వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి కృషి

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

పెద్దపల్లి: వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అదనపు కలెక్టర్ అరుణ శ్రీ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ వయోవృద్ధులు తెలియజేసిన సమస్యలలో జిల్లా యంత్రాం గం పరిధిలోని సమస్యలను సంపూర్ణంగా పరిష్కరించేందు కు అవసరమైన చర్యలు తీసుకుంటామని, ఇతర సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని వయో వృద్ధులను గుర్తించి వారికి ఐడి కార్డులు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. వృద్ధులు తమ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం పనితీరు పట్ల ఏదైనా సలహాలు ఉంటే తెలియజే యాలని, వాటిని సానుకూల దృక్పథంతో తీసుకొని పాటించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. వయో వృద్ధులు ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని, నలుగురితో స్నేహ పూర్వకంగా ఉండాలని, వీలైనంత వరకు తమ పనులు తామే చేసుకోవాలని నవ్వుతూ ఉండాలని కలెక్టర్ కోరారు. సీనియర్ సిటిజన్స్ సంరక్షణ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అంతకుముందు జిల్లా సీనియర్ సిటిజన్స్ ఆర్గనైజేషన్ ద్వారా గత సంవత్సరం నుండి ఇప్పటి వరకు నిర్వహించిన కార్యక్రమాల వివరాలను, వృద్ధులకు చట్టాలపై సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు వివరించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న వృద్ధులు చట్టాలలో చేయవలసిన మార్పులపై, సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై తమ అభిప్రాయాలను సభా దృష్టికి తీసుకొని వచ్చారు. అనంతరం వయో వృద్ధులను జిల్లా కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, వయోవృద్ధులు, వయో వృద్ధుల ఆశ్రమాలు నిర్వహించు నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

# రాజీనామా ఎవరు చేయాలో సీఎం చెప్పాలే

**-దేవుళ్లపై ఒట్టు పెట్టుకుని మోసం చేసిండ్లు**

**-రాష్ట్రాన్నిఅల్లకల్లోలం చేస్తున్న రేవంత్ సర్కార్**

**-మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**



మంథని: రుణమాఫీ విషయంలో ఎవరు రాజీనామా చేయాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ప్రశ్నించారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌కు రైతులందరికి రుణమాఫీ చేయాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే లు కోరుకంటి చందర్, దాసరి మనోహర్ రెడ్డీ తో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పుట్ట మధు మాట్లాడుతూ ఖమ్మంలో జరిగిన కాంగ్రెస్ మీటింగ్‌లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి రైతులందరికి రుణమాఫీ చేస్తున్నం మాజీ మంత్రి హరీష్‌రావు ఇక రాజీనామా చేయి అంటూ మాట్లాడారని, ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయకుండానే గొప్పలు చెప్పుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు జవాబు చెప్పాలన్నారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌కు రుణమాఫీపై వినతిపత్రం ఇస్తామని తెలిసి జిల్లాలోని అనేక మంది రైతులు తరలివచ్చారని, ఏక్కేటి రాజయ్య అనే రైతు వచ్చిన తన రూ. 35వేల రుణం మాఫీ కాలేదని చెప్తున్నాడని, దీనికి ఏమని సమాధానం చెప్తారని ఆయన ప్రశ్నించారు. ఆనాడు దేవుళ్లపై ఒట్లు పెట్టుకుని రైతులందరికి రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పటి వరకు అనేక మంది రైతులకు రుణమాఫీ చేయాలేదన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఏ వర్గానికి అన్యాయం జరుగకుండా పరిపాలన జరిగిందని, అలాంటి పాలనలో ప్రజలను మభ్యపెట్టి మోసం చేసి అధికారంలోకి వచ్చిన చరిత్ర కాంగ్రెస్‌పార్టీదేనన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలన రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేస్తోందని, ఏ ఒక్క వర్గం సంతృప్తిగా లేదన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే కేవలం కాంగ్రెస్ పార్టీ పెద్దలే సంతోషంగా ఉండటమేనా అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీలో కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలు సైతం అసంతృప్తిగా ఉన్నారని, వారికి పథకాలు అందడం లేదన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి కళ్లు తెరిచి ప్రజలకష్టాలను గుర్తించాలని ఆయన హితవుపలికారు.

# పట్టబద్రులారా ఓటు నమోదు చేసుకోండి

**-ఐదు లక్షల ఓటర్ల ఎన్రోల్మెంటును చేయడమే లక్ష్యం**

**-తెలంగాణ మెడికల్ కౌన్సిలర్ మేంబర్ డా.బండారు రాజ్ కుమార్**

మంథని: పట్టభద్రులు అందరు ఎమ్మెల్సీ ఎన్నకల కోసం తమ ఓటు నమోదు చేసుకోవాలని తెలంగాణ మెడికల్ కౌన్సిలర్ మేంబర్, ఆర్ కే హాస్పిటల్ చైర్మన్ బండారు రాజ్ కుమార్ అన్నారు. మంథని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరీంనగర్ ఆదిలాబాద్ మెదక్ నిజామాబాద్ జిల్లాలోని డిగ్రీ చదువుకున్నటువంటి వారు రాబోయే ఎమ్మెల్సీ ఎలక్షన్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఇప్పుడు ఓటును నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు, ఇటీవలే తెలంగాణ గ్రాడ్యుయేట్స్ ఫోర్స్ సంస్థను కొండగట్టు అంజన్న పుణ్యక్షేత్రంలో ఏర్పాటు చేయడం జరిగిం దని, సంస్థ ముఖ్య ఉద్దేశం ఏమిటంటే ఐదు లక్షల ఓటర్ల ఎన్రోల్మెంటును చేయడమే లక్ష్యమని, తెలంగాణ వ్యాప్తంగా ప్రచారం చేస్తున్నామని , ఓటు వేయాలంటే ఓటు హక్కును రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఈ సందర్భంగా మంథనిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగిం దని, డిగ్రీ చదువుకున్న పట్టభద్రులకు మూడు సంవత్సరాలు పూర్తయిన వారు ఆఫ్లైన్, ఆన్లైన్లో నమోదు చేసుకోవచ్చని డిగ్రీ సర్టిఫికెట్ ,ఆధార్ కార్డు ,ఫోటో, ఫోన్ నెంబరు ,ఈమెయిల్ ఐడి ,జతపరిచి ఎమ్మార్వో ఆఫీస్ లో ఇవ్వాల్సి ఉంటుందని, వచ్చే సంవత్సరం జరిగే ఎమ్మెల్సీ ఎలక్షన్లకు ఐదు లక్షల కొత్త ఓటర్లను అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని పనిచేస్తూ ముందుకు వెళ్తున్నామని ,ఓటింగ్ నమోదు చేసుకొని ఓటింగ్ శాతాన్ని పెంచాలని ఈ విధంగా సందర్భంగా పిలుపునిచ్చారు.

# సుప్రీం కోర్టు తీర్పుతో... వైసీపీలో మోదం

న్యూఢిల్లీ: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ అంశం సుప్రీంకోర్టుకు చేరింది. సిట్ విచారణకు చంద్రబాబు ఆదేశించారు. సిట్ నియమించారు. అయితే సిట్ విచారణ వద్దని కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు చేయించాలని సుబ్బారెడ్డి, సుబ్రహ్మణ్య స్వామితో పాటు మరో ఇద్దరు పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్లపై విచారణలో సుప్రీంకోర్టు ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు వైసీపీకి నైతిక బలాన్ని ఇచ్చాయి. ఇప్పటి వరకూ తమ వాదన ఎలా చెప్పుకోవాలో వారికి అర్థం కాలేదు. కానీ ఇప్పుడు సుప్రీంకోర్టే ఆధారాలేవని ప్రశ్నించిందని.. చంద్రబాబు వ్యాఖ్యలతో సిట్ దర్యాప్తు ప్రభావితం అయ్యే అవకాశం ఉ ంటుందన్నట్లుగా వ్యాఖ్యానించడంతో వైసీపీ కాస్త రిలీఫ్ ఫీలయ్యాయి. కేంద్ర దర్యాప్తు సంస్థకు ఇస్తే మంచిదని సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను బట్టి చూస్తే..దర్యాప్తు సీబీఐ లేదా మరో కేంద్ర దర్యాప్తు సంస్థ చేతికి వెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది. లడ్డూ నెయ్యి కల్తీ అంశంపై ఇప్పటికే సిట్ దర్యాప్తు చేస్తోంది. ఈ సిట్ దర్యాప్తుపై సుప్రీంకోర్టు ఎలాంటి స్టే ఇవ్వలేదు. గురువారం తదుపరి విచారణలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇప్పటికే సిట్ దర్యాప్తు కొనసాగుతున్నందున కొనసాగించి.. నివేదిక ఇచ్చిన తర్వాత అభ్యంతరాలు ఉంటే కోర్టుకు రావొచ్చని చెప్పవచ్చని కొంత మంది న్యాయనిపుణులు చెబుతున్నారు. ఒక వేళ అసలు ఏపీ ప్రభుత్వాధినేత ముందుగానే చెప్పారు కాబట్టి సిట్ దర్యాప్తుపై నమ్మకం ఉండదని సుప్రీంకోర్టు ధర్మాసనం కేంద్ర దర్యాప్తు సంస్థలకు సిఫారసు చేయవచ్చు. పిటిషనర్ కోరినట్లుగా తామే దర్యాప్తును పర్యవేక్షిస్తామని చెప్పడం అసాధారణం. ఒక వేళ అలా చెప్పినా దర్యాప్తు అధికారులు కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలకు చెందిన వారే ఉంటారు. అందుకే దర్యాప్తు చేసేది ఎవరైనా పెద్దగా తేడా ఉండదని కొంత మంది భావన. తిరుమలలో జరిగిన లడ్డూ నెయ్యి టెండర్ల విషయంలో భారీ గోల్ మాల్ జరిగిందని ఇప్పటికే ఆధారాలు బయటకు వచ్చాయి. ఏఆర్ డెయిరీకి నిబంధనల ప్రకారం అర్హత లేకపోయినా.. ఉద్దేశపూర్వకంగా టెండర్ నిబంధనలు సవరించి ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే నెయ్యి కూడా ఏఆర్ డెయిరీ నుంచి రావడం లేదు.. దగ్గర్లోని శ్రావణి డెయిరీ అనే సంస్థ నుంచి వస్తున్నాయని కూడా వస్తున్నయని గుర్తించారు. అలాగే నెయ్యిని సరైన టెస్టులు చేయకుండానే లడ్డూల తయారీకి ఉపయోగిస్తున్నరన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

ఇప్పటికే సిట్ అధికారులు వీటన్నింటిపై పరిశీలన జరిపారు. అధికారుల నుంచి అన్ని వివరాలు తీసుకున్నారు. వైసీపీ హయాంలో పెద్ద ఎత్తున టీటీడీలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఒక్క టీటీడీ చైర్మన్ మూడున్నర లక్షల టిక్కెట్లు తన కోటాలో మంజూరు చేశారుని.. రోజా, పెద్దిరెడ్డి వేల కొద్దీ టిక్కెట్లు తీసుకుని అమ్ముకున్నారన్న ఆరోపణలు టీడీపీ నేతలు చేస్తున్నారు. ఒక వేళ నెయ్యి కల్తీ కేసులో తీగ లాగితే..ఈ మొత్తం వ్యవహారాలు బయటకు వస్తే అధికారికంగా బయట పెడితే కేసులు అయ్యే సంగతేమో కానీ.. మందు హిందూ భక్తుల్లో వైఎస్ఆర్‌సీపీకి మరింత మైనస్ అవుతుంది. అందుకే సుప్రీంకోర్టు వ్యాఖ్యలతోనే అంతా అయిపోలేదని ముందు ముందు చాలా కథ ఉ ందని టీడీపీ నేతలంటున్నారు.

# అధికారులు చెరువుల పూర్తి సమాచారం ఇవ్వాలి

హైదరాబాద్: హైడ్రా విషయంలో ప్రజలు తిరగబడితే బంగ్లాదేశ్ ప్రధానికి పట్టిన గతే రేవంత్ రెడ్డికి పడుతుందని కూకట్పల్లి శాసన సభ్యులు మాధవరం కృష్ణారావు అన్నారు. హైడ్రా న్యాయస్థానాల నిర్ణయాలను చట్టాలను సైతం గౌరవించని పరిస్థితి రాష్ట్రంలో నెలకొం దని అన్నారు. కూకట్పల్లి నియోజకవర్గం లో హైడ్రా పేద ప్రజల జోలికి వస్తే సహించేది లేదని కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పష్టం చేశారు. ఓల్డ్ బోయిన్పల్లి డివిజన్ పరిధిలోని బోయిన్ చెరువును ఆయన సందర్శించారు. హరిజన బస్తికి చెందినపేద ప్రజలు తమ నివాసాలను కూల్చివేస్తారన్న భయాందోళన వ్యక్తం చేయగా ఎమ్మెల్యే వారికి భరోసా ఇచ్చారు. కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలో ఉన్న అన్ని చెరువుల పూర్తి సమగ్ర సమాచారాన్ని తనకు అధికారులు అంద జేయాలని ఆదేశించారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే రాజకీయ నాయకుల పై ఘాటైన విమర్శలు చేశారు. పేద ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తూ భయపడితేఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరిం చారు. సామాజిక మాధ్యమాలలో హైడ్రా పేరుతో బెదిరింపులకు పాల్పడే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని వెల్లడించారు.

# ఇక త్వరలోనే హైడ్రోజన్ రైళ్లు

ముంబై: భారత దేశంలో రైల్వే వ్యవస్థ చాలా పురాతనమైంది. బ్రిటిక్ కాలంలోనే దేశంలో రైల్వే వ్యవస్థ మొదలైంది. 1890లో బ్రిటిష్ పాలకులు తమ అవసరాల కోసం రైలు మార్గం నిర్మించారు. క్రమంగా విస్తరించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత ప్రభుత్వం కూడా రైల్వే వ్యవస్థను విస్తరించింది. నిత్యం లక్షల మందికి రైల్వే ప్రధాన రవాణా సాధనం. కాలక్రమేణా ఇండియన్ రైల్వే అనేక కొత్త రైళ్లను ప్రవేశపెడుతూ రైల్వేను ఆధునికీకరిస్తూ.. కొత్త రైలు మార్గాలు నిర్మిస్తూ వస్తోంది. ఈ క్రమంలోనే రాజధాని, శతాబ్ది, వందేభారత్, వందే మెట్రో, వందే సాధారణ్ పేరులో అనేక రైళ్లను కేంద్రం ప్రవేశపెట్టింది. ఇక త్వరలోనే హైడ్రోజన్ రైళ్లను పట్టాలెక్కించే పనిలో ఉంది కేంద్రంలోని మోదీ సర్కార్. 2025 చివరి నాటికి బుల్లెట్ రైలును కూడా పట్టాలెక్కించాలన్న సంకల్పంతో ఉంది. పూరిత్గా దేశీయ పరిజ్ఞానంతో గంటకు 250 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా ఇంజిన్లను తయారు చేయబోతోంది. ఇదే సమయంలో మరో కొత్త రైలు తెచ్చే ప్రయత్నం చేస్తోంది.కొత్తగా తెచ్చే రైలును ఆటోమేటెడ్ పీపుల్ మూవర్?ఏపీఎం సర్వీసుగా వ్యవహరించే ఈ ఎయిర్ ట్రైన్ న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రారంభం కాబోతోంది. మిమానాశ్రయంలో ఉన్న మూడు టెర్మినళ్లకు వెళ్లేందుకు లేదంటే విమానాన్ని డీబోర్డింగ్ చేసిన తర్వాత క్యాబ్ కోసం సర్వీస్‌ను అందుబాటులో ఉంచనుంది. అయితే ఇక్కడ సమయం చాలా ఎక్కువ పడుతుంది. రద్దీగా ఉండే విమానాశ్రయం. ఏడు కోట్ల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు.విమానాశ్రయంలో ఒక టెర్మినల్ నుంచి మరో టెర్మినల్‌కు ప్రయాణికులు వెళ్లే సమయంలో ఆలస్యాన్ని నివారించేందుకు ఈ ఎయిర్ ట్రైన్ తీసుకురాబోతున్నారు. ఇది మెట్రో తరహాలో డ్రైవర్ లేకుండా పనిచేస్తుంది.

రూ. 2 వేల కోట్ల రూపాయలతో దీనిని ప్రారంభించబోతున్నార. 2027 నాటికి ఈ రైలు అందుబాటులోకి వస్తుంది. తక్కువ బోగీలు ఉండి ట్రాక్‌పై నడుస్తుంది. విమానాశ్రయంలో హోటళ్లు, క్యాబ్ ఎక్కే పాయింట్లు, పార్కింగ్, ఇతర టెర్మినల్స్ వెళ్లడానికి అవకాశం ఉంటుంది. వేగంగా తీసుకెళ్తుంది. నాలుగు స్టాపులతో 7.7 కిలోమీటర్ల దూరాన్ని కవర్ చేస్తుంది. దీని కోసం ఈ ఏడాది చివరన టెండర్లు పిలవాలని కేంద్రం నిర్ణయించింది.

# హైడ్రా రూపంలో గులాబీకి కలిసొస్తే...

హైదరాబాద: రాజకీయాల్లో ఎప్పుడు ఎవరిని ఏ రూపకంగా అదృష్టం వరిస్తుందో ఊహించలేం. పదేళ్ల పాటు చతికిల పడిపోయిన కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఎవరైనా ఊహించారా..? అంతే మరి రాజకీయాల్లో ఇలాంటి మిరాకిల్స్ జరుగుతూనే ఉంటాయి. తెలంగాణకు రేవంత్ రెడ్డి సైతం ముఖ్యమంత్రి అవుతారని కూడా బహుషా ఎవరూ ఊహించి ఉండరేమో. కానీ.. అదృష్టవశాత్తూ ఆయన ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. అలాగే.. కొన్ని కొన్ని ఉదంతాలు కూడా ఆయా పార్టీలకు కలిసొస్తుంటాయి.సరిగా ఇప్పుడు బీఆర్ఎస్‌కు అలాంటి అదృష్టమే కలిసొచ్చింది. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న పార్టీ గత ఎన్నికల్లో ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. దాంతో అప్పటి నుంచి ఆ పార్టీ ప్రతిపక్ష పాత్ర పోషిస్తోంది. ఇప్పటికే అధికారం కోల్పోయి ఇబ్బందులు పడుతున్న పార్టీకి హైడ్రా ఊపిరిపోసింది. హైడ్రా కాస్త బీఆర్ఎస్‌కు అస్త్రంగా దొరికింది. జీవితకాలం కష్టపడి సంపాదించుకున్న ఇళ్లు కళ్లముందే నేలమట్టం అవుతుండడంతో బాధితులు రేవంత్ సర్కార్‌పై దుమ్మెత్తిపోస్తున్నారు. కూల్చివేతలు ఆపాలని, కూల్చివేతలు వద్దని వేడుకున్నారు. అదేసమయంలో బాధితులంతా కలిసి బీఆర్ఎస్ తలుపుతట్టడం ఆ పార్టీకి మరింత కలిసివచ్చింది. దాంతో అందివచ్చిన అవకాశాన్ని అవసరం మేరకు వాడుకోవాలని బీఆర్ఎస్ పార్టీ చూస్తోంది.ఇక.. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోకి వస్తే అక్కడ 40 ఏళ్ల సీనియర్ నాయకుడు చంద్రబాబు ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్నారు. జగన్ కూడా మొన్నటి వరకు సీఎంగా ఉన్నారు. ఇప్పుడు అధికారం కోల్పోయి ప్రతిపక్షంలో ఉన్నారు. అయితే.. దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు తన పాలనలో ఎక్కడ కూడా వైసీపీకి ఛాన్స్ ఇవ్వడం లేదు. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పాలనను నడిపిస్తున్నారు. జగన్ హయాంలో అనాలోచిత నిర్ణయాలతో పాలన గాడిన తప్పిందని భావించిన చంద్రబాబు.. ఇప్పుడు వాటిని సరిదిద్దే పనిలో పడ్డారు. అందులో భాగంగా గతంలో రాష్ట్రం నుంచి తరలిపోయిన కంపెనీలను, పెట్టుబడులను తిరిగి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. మొత్తానికి రాష్ట్రానికి ఇప్పటికైనా రాజధానిని నిర్మించి చూపించాలనే కసితో ఉన్నారు.ఐదేళ్లుగా నిద్రావస్థలో ఉండిపోయిన వ్యవస్థలన్నింటినీ ఇప్పుడు నిద్ర లేపుతున్నారు. అవకాశం దొరికినప్పుడల్లా వారికి స్ట్రాంగ్ వార్నింగులు ఇస్తూ వస్తున్నారు. అలాగే.. అమరావతిని చీకట్లోకి నెట్టి మూడు రాజధానుల అంశాన్ని జగన్ తీసుకొచ్చారు. దాంతో ఇప్పుడు మూడు రాజధానుల ప్రస్తావనే తీసుకురాకుండా అమరావతిని రాజధాని అని.. అమరావతికి మరోసారి జీవం పోసే విధంగా చూస్తున్నారు. ఇక ఇప్పట్లో ఆయన మీద అక్కడ వ్యతిరేకత వచ్చే పరిస్థితులైతే ఏం కనిపించడం లేదు. అయితే.. అక్కడ ఉల్టా చంద్రబాబు చేతికే ఓ ఆయుధం దొరికింది. అదే తిరుమల లడ్డూ వివాదం. ఈ వివాదంలో ఇప్పటికే వైసీపీని ఏ స్థాయిలో దిగజార్చాలో ఆ స్థాయికి చేర్చారు. దేశవ్యాప్తంగా ఆ పార్టీపై వ్యతిరేకత వచ్చేలా చేయడంలో సక్సెస్ అయ్యారనే చెప్పాలి.

తెలుగు రాష్ట్రాలలో కేసీఆర్, జగన్ ఒకేసారి అధికారం కోల్పోయారు. ఇప్పుడు ఇరు పార్టీలు కూడా ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నాయి. కానీ.. తెలంగాణలో బీఆర్ఎస్‌కు వచ్చిన మైలేజీ ఏపీలో వైసీపీకి దొరక్కపోవడం గమనార్హం.

# బీజేపీ,,, ఫెయిల్... బీఆర్ఎస్ పాస్...

హైదరాబాద: తెలంగాణ రాష్ట్రంలో ఇప్పుడు రాజకీయాలు హాట్‌హాట్‌గా నడుస్తున్నాయి. అధికార, ప్రతిపక్షాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా విమర్శలు, ప్రతివిమర్శలు కొనసాగుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో హైడ్రా చుట్టూనే రాజకీయాలు కొనసాగుతున్నాయి. ప్రజాక్షేత్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని దోషిగా నిలబెట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ ప్రయత్నం చేస్తోంది. కానీ.. ఇదే సమయంలో బీజేపీ వైఖరి మాత్రం చర్చకు దారితీసింది. గతంలో బీఆర్ఎస్ ఎత్తుకొని వదిలేసిన అంశాన్ని బీజేపీ భుజాన వేసుకుంది.రాష్ట్రంలో, ముఖ్యంగా హైదరాబాద్ మహానగరంలో ఇప్పుడు హైడ్రా మీదే పంచాయితీ కొనసాగుతోంది. కానీ ఈ అంశాన్ని క్యాష్ చేసుకోవడంలో బీజేపీ మాత్రం ఫెయిల్ అయినట్లుగానే అనిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల వేళ రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. ఒకే దఫాలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించింది. దానిపై వరంగల్ సభా వేదికగా రైతు డిక్లరేషన్ ప్రకటించారు. అంతవరకు బాగానే ఉన్నా.. అధికారంలోకి వచ్చాక ఆరు నెలల తరువాత కాంగ్రెస్ రుణమాఫీ చేసేందుకు సిద్ధమైంది. చెప్పినట్లుగా ముందు లక్ష ఆ తరువాత లక్షన్నర, ఆ తరువాత రెండు లక్షల వరకు ఉన్న రుణాలను మాఫీ చేసింది. కానీ.. అందులోనూ లొసుగులు ఉండడంతో ఆ సమయంలో బీఆర్ఎస్ పార్టీ ఆ అంశాన్ని టార్గెట్ చేసింది.రుణమాఫీ అందరికీ జరగలేదని, చాలా మంది రైతులు ఇంకా రుణమాఫీ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉందని బీఆర్ఎస్ నేతలు నిరసనలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ కార్యకర్తలు, రైతులతో కలిసి తమ నిరసనలను తెలిపారు. అలాగే.. కాంగ్రెస్ హైకమండ్‌కు సైతం లేఖల రూపంలో సమస్యను తెలిపారు. ఒకవిధంగా చెప్పాలంటే.. రైతు రుణమాఫీ విషయంపై ప్రభుత్వాన్ని ఆగమాగం చేశారు. చివరకు ముఖ్యమంత్రి, మంత్రులు ప్రెస్‌మీట్లు పెట్టి దానిపై క్లారిటీ ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చింది. టెక్నికల్ సమస్యల వల్ల కొందరికి రుణమాఫీ కాలేదని, వారి సమస్యను కూడా పరిష్కరిస్తామని చెప్పుకొచ్చారు.సో.. అప్పటి నుంచి ఆ రాద్ధాంతం కాస్త చల్లారింది. ఆ వెంటనే నగరంలో హైడ్రా మీద నిరసనలు మొదలయ్యాయి. హైడ్రా మీద ప్రజలు ఏకంగా బీఆర్ఎస్ పార్టీ తలుపులు తట్టాల్సిన పరిస్థితి వచ్చింది. దాంతో ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు రుణమాఫీ అంశాన్ని పక్కనపడేసి ఈ హైడ్రాపై ఫోకస్ పెట్టారు. పేదల తరఫున పోరాడేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే పలువురు నేతలు తమ వాయిస్ వినిపిస్తున్నారు. నిరసన కార్యక్రమాల్లోనూ భాగమయ్యారు.

ఇక ముందు కూడా హైడ్రాపై మరింత ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. నిరసనలు, ఆందోళనలు మరింత పీక్స్‌కు చేర్చాలని అనుకున్నారు. సహాయం కోసం వచ్చిన బాధితులందరికీ అండగా నిలవాలని పార్టీలో చర్చించారు. బీఆర్ఎస్ పార్టీ వైఖరి ఇలా ఉంటే.. బీజేపీ మాత్రం రివర్స్‌లో వెళ్తున్నట్లు కనిపిస్తోంది. రైతు ఉద్యమాలను బీఆర్ఎస్ పార్టీ పక్కన పెడితే 'పాత చింతకాయ పచ్చడి'లా.. బీఆర్ఎస్ ఎప్పుడో వదిలేసిన రుణమాఫీ అంశాన్ని ఇప్పుడు భుజాన వేసుకుంది. నేడు రైతు దీక్షకు దిగింది. దీంతో పార్టీలోని సీనియర్ల నుంచి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ వదిలేసిన అస్త్రాలను పట్టుకొని రాజకీయం చేయడం ఏంటని అసహనం చేస్తున్నారని తెలిసింది. ఇప్పుడు నగర వ్యాప్తంగా హైడ్రా సమస్య కొనసాగుతుంటే? ఈ సమయంలో రుణమాఫీ గురించి దీక్షలు చేస్తే ఎవరు పట్టించుకుంటారని అన్నారని టాక్.

# ఈ నెల 3 వ తేది నుండి రాష్ట్ర వ్యాప్తంగా చేప పిల్లల పంపిణీ కార్యక్రమం

**– భవిష్యత్ లో మత్స్యకారుల కుటుంబాల్లో సిరులు కురవాలి**

**– మంత్రి పొన్నం ప్రభాకర్**

హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా చెరువులు నిండుకుండలా మారాయని తెలంగాణ జిల్లాల్లోని అన్ని చెరువుల్లో చేపల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. దీంతో సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 3 వ తేదీ నుండి చేప పిల్లల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. అన్ని జిల్లాల్లో తెలంగాణ మత్యశాఖ తరుపున చేపల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. జిల్లాలో మంత్రులు ,విప్ లు , ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు ,ఎంపిలు కార్పొరేషన్ చైర్మన్ లు , ప్రభుత్వ సలహాదారులు మత్స్య కార్మిక కుటుంబాలకు అండగా ఉండే విధంగా చేపల పంపిణీ కార్యక్రమం లో పాల్గొనాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వంలో వ్యవసాయం దాని అనుబంధ రంగాల్లో వెలుగులు నింపేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా చెరువుల్లో చేప పిల్లల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. చెరువుల్లో వేసే దానిలో నాణ్యమైన చేప పిల్లల పంపిణీ చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. చేప పిల్లల పంపిణీ గ్రామాల్లో ఒక పండగ వాతావరణంలో జరగాలని సూచించారు. అన్ని చెరువులు , ప్రాజెక్ట్ లు జలకళ సంతరించుకోవడంతో చేప పిల్లల పంపిణీ భవిష్యత్ లో మత్స్యకారుల కుటుంబాల్లో సిరులు కురవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. ఫిషరీస్ కార్పోరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, ఫిషరీస్ డిపార్ట్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్ తో పాటు , డైరెక్టర్ ప్రియాంక అలా చేప పిల్లల పంపిణీ కార్యక్రమంకి సంబంధించిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

# హర్యానాపై గెలుపు ధీమా...

ఛండీఘడ్: హర్యానా ఎన్నికల్లో ప్రధాన పార్టీలు గెలుపుపై మౌనంగానే ఉన్నాయి. బయటకు తమదే గెలుపు అన్న ధీమాను అన్ని పార్టీలూ ప్రదర్శిస్తున్నప్పటికీ భయం మాత్రం అన్ని పార్టీలనూ వెంటాడుతూనే ఉంది. ఒంటరిపోరుకు సిద్ధమయిన అన్ని పార్టీల్లో గెలుపు అంచనాలు ఎవరికీ అందకుండా ఉన్నాయి. కానీ జనం మూడ్ ఎలా ఉందన్నది మాత్రం ఫీడ్ బ్యాక్ ద్వారా తెలుసుకుని అందుకు అనుగుణంగా అడుగులు వేస్తున్నాయి. గెలుపు పై ఎవరికి స్పష్టత లేకపోయినప్పటికీ తమ ప్రయత్నాలను మాత్రం చివరి వరకూ చేయాల్సిందేగా. అందుకే ఎవరి స్ట్రాటజీతో వారు ఎన్నికలకు వెళుతున్నారు. అయితే చివకు ఎవరి ఎన్నికల వ్యూహం పనిచేస్తుందన్న దానిపైనే గెలుపు ఆధారపడి ఉంటుందన్న విశ్లేషణలు హర్యానా ఎన్నికల్లో వెలువడుతున్నాయి కాంగ్రెస్ గత లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను చూసి కొంత ఊపు మీదున్నప్పటికీ ఆ పార్టీకి అనేక అవరోధాలున్నాయి. అందుకే కేంద్ర ప్రభుత్వంపై వ్యతిరేకతతో ఉన్న రెజ్లర్లు వినేశ్ ఫోగట్, భజరంగ్ పునియాలను పార్టీలోకి చేర్చుకుంది. ప్రధాన సామాజికవర్గమైన జాట్లుఈసారి తమకు అనుకూలంగా ఉంటుందని, అదే సమయంలో రెజ్లర్లకు జరిగిన అన్యాయంతో ప్రజలు తమ వైపు మొగ్గుచూపుతారని భావిస్తుంది. అయితే ఆమ్ ఆద్మీపార్టీ విడిగా పోటీ చేస్తుండటంతో పాటు నాయకత్వ సమస్య కూడా కాంగ్రెస్ ను వెంటాడుతుంది. అనేకమంది అభ్యర్థుల ఎంపిక తర్వాత పార్టీలో కొంత అసంతృప్తులు పెరిగాయి. ఇతర పార్టీలలో చేరిపోవడంతో తాము బలహీనంగా మారామా? అన్న ప్రశ్న కాంగ్రెస్ ను వెంటాడుతుంది. అదే సమయంలో బీజేపీకి కూడా అంత సానుకూల వాతావరణం లేదు. అభ్యర్థుల ప్రకటనల తర్వాత నేతల్లో అసంతృప్తి పెరిగింది. మంత్రుల నుంచి ముఖ్యమైన నేతలు పార్టీని వదిలి వెళ్లారు.ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి టిక్కెట్లు ఇవ్వడం కూడా సొంత పార్టీ క్యాడర్ లో అగ్గి రాజేసింది. జాట్లు తమకు ప్రతికూలమని భావించిన బీజేపీ కేంద్ర నాయకత్వం దానికి విరుగుడుగా వెనుకబడిన కులాలను తమ వైపునకు తిప్పుకునే వ్యూహాన్ని రచించింది. అందుకే? ఓబీసీకి చెందిన నయబ్ సైనీని ముఖ్యమంత్రిగా చేయడమే కాకుండా తిరిగి అధికారంలోకి వస్తే ఆయననే సీఎం అభ్యర్థిగా ప్రకటించి పార్టీకి ఊపు తెచ్చింది. సైనీని ముందు పెట్టి ఎన్నికలకు వెళుతుండటంతో తమ గెలుపు గ్యారంటీ అనుకుంటోంది.

మరో వైపు పార్టీని దెబ్బతీసే అనేక అంశాలు కూడా భయపెడుతున్నాయి. మొత్తం మీద గెలుపుపై ఎవరి ధీమా వారిదే అన్న తరహాలో హర్యానా రాజకీయాలు కొనసాగుతున్నాయి.

# ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా రుణమాఫీ

**– దుర్బుద్ధితోనే సర్కారుపై బీఆర్ఎస్, బీజేపీ విమర్శలు : మంత్రి తుమ్మల**



హైదరాబాద్: ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ చేసిందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మూడు విడతల్లో రూ.18వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7,656 కోట్లు రైతుబంధు బకాయిలు కూడా వేశామన్నారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి విలేకర్లతో మాట్లాడారు. రైతులను ఆదుకుంటున్న ప్రభుత్వానికి బీఆర్ఎస్, బీజేపీ నేతలు సహకరించకపోగా తమపై విమర్శలు చేస్తున్నారన్నారు. 42 లక్షల మందికి రుణమాఫీ చేశామని ఎప్పుడూ చెప్పలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు బకాయిలను ఆ పార్టీ లెక్కలోకి తీసుకోవడం లేదని విమర్శించారు. పంటరుణాలు తీసుకున్న 42లక్షల మంది రైతుల వివరాలను బ్యాంకర్లు ఇచ్చారనీ, వారికి రూ.31వేల కోట్ల రుణమాఫీ చేయాల్సి ఉందన్నారు.రుణమాఫీ కాని వారి వివరాలు పంపాలని అధికారులను ఆదేశించామన్నారు. ఒకే నెలలో 22లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.18వేల కోట్లు జమ చేశామని గుర్తు చేశారు. రూ.2లక్షలకు పైగా రుణం ఉన్న వారికి రూ.2లక్షలు వేస్తామని చెప్పాం. ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలనే దుర్బుద్ధితో ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేండ్లు పాలించిన పార్టీ నేతలు కూడా రుణమాఫీని విమర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు.

# ఇక ఓలా రెస్ట్ రూమ్స్...

హైదరాబాద్: టెక్నాలజీ సృష్టించిన విప్లవం వల్ల మనిషి జీవితం లిరిక్ లేని సంగీతం అయిపోయింది. ప్రతిరోజు ఉరుకులు పరుగులు.. సాటి మనిషితో రెండు నిమిషాలు మాట్లాడలేనంత బిజీ.. ఏ పని కావాలన్నా అరచేతిలో ఇమిడిపోయే స్మార్ట్ ఫోన్ చేసిపెడుతోంది.. అన్ని కాళ్ళ ముందుకు తెచ్చిపెడుతోంది. ఒకప్పుడు ఆన్లైన్లో ఫుడ్ డెలివరీ అంటేనే చాలామంది నొసలు చిట్లించారు. ఆన్లైన్ ఫుడ్ నుంచి మొదలు పెడితే ఆన్లైన్ గ్రాసరీ వరకు అది విస్తరించింది. ఆ తర్వాత ఆన్లైన్ టాక్సీ.. ఆన్లైన్ మెడిసిన్.. ఆన్లైన్ మద్యం.. ఇలా అనేక పుంతలు తొక్కింది. అయితే ఇది ఎక్కడిదాకా వెళ్తుందో ఇప్పటికైతే చెప్పలేం గాని.. ఒక మనిషి జీవితానికి సంబంధించిన అన్నింటిని ఆన్లైన్ ప్రభావితం చేస్తోంది. తినే తిండి, తాగే నీరు, వేసుకునే మందులు, కాస్త ఉపశమనం కోసం సేవించే మద్యం.. ఇలా ప్రతి ఒక్కటి ఆన్లైన్లోనే జరిగిపోతున్నాయి. ఇటీవల కొన్ని ప్రైవేట్ సంస్థలయితే ఏకంగా ఆన్లైన్లోనే నిత్యవసరాలను సరఫరా చేస్తున్నాయి. ఇటీవల ఓ పాల తయారీ సంస్థ యాప్ లో బుక్ చేసుకుంటే చాలు మీ ఇంటికే మిల్క్ తీసుకొస్తామని ఆఫర్ ప్రకటించింది. చివరికి మాంసం కూడా ఆన్లైన్ డెలివరీ సరుకుల్లో చేరిపోయింది. ఉరుకుల పరుగుల జీవితానికి అలవాటు పడి మనిషి కుదురుగా లేకపోవడం.. ఏ చిన్న విషయానికి కూడా సమయం వెచ్చించలేకపోవడం వల్ల ఆన్లైన్ అనేది అత్యవసరంగా మారిపోయింది..మనదేశంలో ఓలా అనే సంస్థ ఆన్లైన్ టాక్సీ లను పరిచయం చేసింది. దేశవ్యాప్తంగా ఈ సంస్థ సేవలందిస్తోంది. ఇటీవల గ్రాసరి విభాగంలోకి వచ్చింది. కొన్ని ప్రాంతాలలో ఫుడ్ సర్వీసులు కూడా అందిస్తోంది. అయితే ఇప్పుడు ఎవరూ ఊహించని వ్యాపారం లోకి వచ్చింది. సాధారణంగా మనము ఏదైనా పని నిమిత్తం బయటకు వెళ్లినప్పుడు అత్యవసరంగా ఒకటి గాని రెండు గాని వస్తే వెంటనే బాత్ రూమ్ లు ఎక్కడ ఉన్నాయా అని చూస్తాం. ఒకవేళ బాత్ రూం లు లేకపోతే నరకం చూస్తాం. ఆ సమయంలో ఆ బాధ భరించలేనిది. అదే అటువంటి సమయంలో మేమున్నామంటూ ఓలా ముందుకు వచ్చింది. అత్యవసరమైన రెస్ట్ రూం పేరుతో ఒక సర్వీస్ ప్రారంభించింది. ఇందులో ఒంటికి, రెంటికి వెళ్లే అవకాశం ఉంటుంది. కడుపు ఉబ్బరాన్ని.. ఉదర భారాన్ని తగ్గించుకోవడానికి ఏర్పాట్లు ఉంటాయి. అయితే వాస్తవానికి మనదేశంలో ఇలాంటి సర్వీసులు ఇంతవరకు ఏ కంపెనీ అందుబాటులోకి తేలేదు. అయితే ఈ సర్వీస్ ను తాము అందుబాటులోకి తెచ్చామని ఓలా సగర్వంగా చెబుతోంది. దీనికి సంబంధించిన ప్రకటనను కూడా వినూత్నంగా రూపొందించింది. మెట్రో, కాస్మోపాలిటన్, టైర్ –1 సిటీస్లో ఈ సౌకర్యాన్ని ఓలా అందుబాటులోకి తీసుకురానుంది. ఈ వీడియో పై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. అయితే ఇది కూడా ఆన్లైన్ కావడంతో చాలామంది నొసలు చిట్లిస్తున్నారు. మనిషి జీవితం ఎంత బిజీగా మారుతుందో.. అదే స్థాయిలో కొత్త కొత్త సౌకర్యాలు అందుబాటులోకి వస్తున్నాయని.. ఇలాంటివి ఆశ్చర్యాన్ని కలిగించినప్పటికీ.. మనిషి ఏం కోల్పోతున్నాడో చెబుతున్నాయని నెటిజన్లు వ్యాఖ్యానిస్తున్నారు.

# పోస్టల్ సేవల్ని వినియోగించుకోండి

**– ఆత్మీయులకు బహుమతులు పంపండి**

**– నాలుగు నెలలపాటు డాక్ పార్సిల్ మహోత్సవ్**



హైదరాబాద్: దసరా, దీపావళి, గురునానక్ జయంతి, క్రిస్ట్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి%Ô%వచ్చే నాలుగునెలలు వరుస పండుగలే. ఈ సీజన్‌లో ఆత్మీయులకు తక్కువ ఖర్చుతో, వేగంగా బహుమతుల్ని చేరవేసేందుకు తపాలాశాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

దానికోసం వచ్చే నాలుగునెలలు వర్తించేలా 'డాక్ పార్సిల్ మహోత్సవ్' ను నిర్వహిస్తున్నది. స్థానికంగానే కాకుండా, దేశంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా, విదేశాలకు సైతం పార్సిళ్లను బట్వాడా చేసేలా ఏర్పాట్లు చేసామని తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ హెచ్ శరత్‌కుమార్ తెలిపారు. రాష్ట్రంలోని 6,268 పోస్టాఫీసుల్లో పార్సిల్ సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. అదేసమయంలో రాష్ట్రవ్యాప్తంగా 31 ప్రత్యేక కేంద్రాలను కూడా నెలకొల్పినట్టు ఆయన వివరించారు. పార్సిల్ బుకింగ్స్ కోసం పోస్టాఫీసుల్లో పనిగంటలు పొడిగించామనీ, ఇండ్లు, కార్యాలయాల నుంచి నేరుగా పార్సిళ్లు సేకరించే ఏర్పాటు కూడా చేశామన్నారు. గ్రామస్థాయి పరిశ్రమలకు సేవలు అందించేందుకు 1,036 కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటయ్యాయనీ, 48 ఫ్రాంఛైంజీ ఔట్‌లెట్లలో కూడా స్పీడ్ పోస్ట్ సౌకర్యాలు కల్పించామన్నారు. 31 పార్సిల్ ప్యాకింగ్ యూనిట్లతో పాటు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సరుకు ఎగుమతులు, స్వయం సహాయక బృందాలు, హస్తకళలు (హ్యాండీక్రాఫ్ట్), చేనేతరంగానికి సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

అలాగే ఇంటర్నేషనల బిజినెస్ సెంటర్ (ఐబీసీ) ఇంటర్నేషనల్ ట్రాక్డ్ ప్యాకెట్ సర్వీసులు కూడా ఉన్నాయని తెలిపారు. వినియోగదారులకు తమ వస్తువుల బట్వాడాకు సంబంధించి ప్రీ డెలివరీ అలెర్ట్స్‌తో పాటు ఆన్‌లైన్ ట్రాకింగ్, డోర్ డెలివరీ సౌకర్యాలు కూడా కల్పిస్తున్నామని ఆయన వివరించారు. పార్సిళ్లు చేరవేసేందుకు దేశీయంగా వివిధ నగరాలను కలుపుతూ 37 డైరెక్ట్ విమాన సర్వీసుల్ని వినియోగించుకుంటున్నామనీ, మరో 13 విదేశీ విమానాల ద్వారా కూడా పార్సిళ్లను బట్వాడా చేస్తున్నామని చెప్పారు. పోస్టాఫీసుల ద్వారా పార్సిళ్లను బుక్ చేసుకుంటే రకరకాల ఆఫర్లు, సేవల్ని కూడా వినియోగదారులకు అందిస్తున్నామని తెలిపారు. ప్రజలు పోస్టల్ పార్సిల్ సర్వీసుల్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**